



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 214 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : చిత్తూరు గురువారం 13 ఆగస్టు 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :214 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : CHITTOOR THU 13 AUGUST 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur


## శాసనమండలిలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం



- అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రజాప్రతినిధులకు జగన్ పిలుపు
- డీఎస్సీ అవకతవకలపై ప్రభుత్వం స్పందించడం లేదన్న బొత్స
- 40 శాతం ఓట్లు వచ్చిన పార్టీకి ప్రతిపక్ష హోదా ఎందుకు ఇవ్వరని ప్రశ్న

**పెన్ పవర్ డెస్క్:**రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలపై గళమెత్తి, కూటమి ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని వైసీపీ అధినేత జగన్ పార్టీ ప్రజాప్రతినిధులకు పిలుపునిచ్చారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన శాసనసభా పక్ష సమావేశంలో సభ్యులకు ఆయన దిశానిర్దేశం చేశారు. అనంతరం సమావేశంలో చర్చించిన కీలక అంశాలను శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మీడియాకు వెల్లడించారు.డీఎస్సీ నియామకాల

- మిగతా 2లో

## జగన్‌కు ధైర్యముంటే అసెంబ్లీకి రావాలి.. ఆధారాలతో చర్చకు మేం సిద్ధం



- మెగా డీఎస్సీపై వైసీపీ ఆరోపణలను తిప్పికొట్టిన అనిత
- రోడ్డు మీద నిలబడి ఆరోపణలు చేయడం కాదంటూ జగన్ కు కౌంటర్
- సభకు వచ్చి ఆధారాలు చూపాలని సవాల్

**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ అధినేత జగన్ కు ధైర్యముంటే అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలని, రోడ్ల మీద నిలబడి చేసే ఆరోపణలకు సభలో ఆధారాలు చూపాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత సవాల్ విసిరారు. శాసనసభకు రాకుండా బయట విమర్శలు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆమె అన్నారు. బుధవారం నాడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజా వినతులు స్వీకరించిన అనంతరం

- మిగతా 2లో



## డిసెంబరు నుంచి ఎస్క్రో ఖాతాల్లో ప్రోత్సాహకాలు

### సీఎం చంద్రబాబు ఆదేశాలు

- చంద్రబాబు అధ్యక్షతన ఎస్ఐపీబీ సమావేశం
- పారిశ్రామిక రంగానికి అందిస్తున్న ప్రోత్సాహకాల చెల్లింపు విధానంలో కీలక మార్పు
- ఈ విధానం ద్వారా పారదర్శకతను పెంచడమే లక్ష్యం
- నిధుల వినియోగాన్ని సమర్థవంతంగా పర్యవేక్షించవచ్చన్న సీఎం

**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలో పారిశ్రామిక రంగానికి అందిస్తున్న ప్రోత్సాహకాల చెల్లింపు విధానంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలకమైన మార్పులకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది డిసెంబరు నుంచి పరిశ్రమలకు ఇచ్చే అన్ని రకాల ప్రోత్సాహకాలను (ఇన్సెంటివ్స్) నేరుగా ప్రత్యేక ఎస్క్రో ఖాతాల్లో జమ చేసేలా చర్యలు చేపట్టాలని

- మిగతా 2లో

# ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా గొంతు నొక్కుతున్నారు..

- ఆగస్టు 17 నుంచి ఏపీ శాసనసభ సమావేశాలు
- పార్టీ ప్రజాప్రతినిధులకు జగన్ దిశానిర్దేశం
- శాసనమండలిలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ఎమ్మెల్సీలకు సూచన
- ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతుల సమస్యలపై గళమెత్తాలని ఆదేశం
- ప్రజా సమస్యలను మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళతానన్న జగన్



**పెన్ పవర్ డెస్క్:** ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా తమ గొంతు నొక్కేందుకే చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆరోపించారు. శాసనసభను దాదాపు రెండేళ్లుగా బహిష్కరిస్తున్నప్పటికీ, శాసనమండలి వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ఆయన పార్టీ ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు.
ఆగస్టు 17 నుంచి ప్రారంభం కానున్న శాసనసభ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో బుధవారం నాడు ఆయన పార్టీ శాసనసభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన పార్టీ అయిన వైసీపీకి ప్రతిపక్ష నేత హోదా ఇచ్చేందుకు ప్రభుత్వం ఇష్టపడటం లేదని, అందుకే ప్రజా సమస్యలను మీడియా ద్వారానే ప్రజల దృష్టికి తీసుకెళ్లి నాణేనికి మరోవైపు చూపిస్తానని స్పష్టం చేశారు. శాసనమండలిలో వైసీపీకి ఉన్న బలాన్ని ఉపయోగించుకుని ప్రజావాణిని బలంగా వినిపించాలని జగన్ సూచించారు. “గత 74 రోజులుగా డీఎస్సీ కుంభకోణంపై 10 రకాల నిరసనలు చేపట్టాం. పేపర్ లీకేజీ, ఔట్‌సోర్సింగ్ కుంభకోణాలు, స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు, ప్రభుత్వ ఉత్తర్వుల మార్పు వంటి అంశాలను ఆధారాలతో సహా బయటపెట్టాం. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రమేయంపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశాం” అని జగన్

- మిగతా 2లో



## చంద్రబాబు ఒక విజనరీ లీడర్

### రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- నిజమైన అభివృద్ధికి చంద్రబాబు చిరునామా అన్న ద్రౌపది ముర్ము
- ఏపీ అభివృద్ధికి చంద్రబాబు చేస్తున్న కృషి అభినందనీయమని ప్రశంస
- రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళుతున్నారన్న రాష్ట్రపతి

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనా దక్షతపై భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసలు కురిపించారు. చంద్రబాబు విజనరీ లీడర్ అని కొనియాడిన ఆమె... రాష్ట్రంలో నిజమైన అభివృద్ధికి ఆయనే అసలైన చిరునామా

- మిగతా 2లో



## రాజ్యసభను కుదిపేసిన “లుంగీవాలా” వివాదం

- తనను లుంగీవాలా అని పిలిచారంటూ బీజేపీ ఎంపీపై సీపీఎం ఎంపీ ఫిర్యాదు
- ఆ వ్యాఖ్యలు తాను చేయలేదని, బ్రిట్టాస్ అబద్ధం చెబుతున్నారని సుస్మితా దేవ్ ఖండన
- ఒకరిపై మరొకరు హక్కుల ఉల్లంఘన నోటీసులు దాఖలు

**పెన్ పవర్ డెస్క్:**రాజ్యసభలో బుధవారం ‘లుంగీవాలా’ వివాదం తీవ్ర దుమారం రేపింది. తనను ఉద్దేశించి బీజేపీ ఎంపీ సుస్మితా దేవ్ ఈ పదాన్ని ఉపయోగించారని కేరళకు చెందిన సీపీఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ ఆరోపించడంతో సభలో గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు.సోమవారం నాడు సభలో తాను ఆదాయపు పన్ను సవరణ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న సమయంలో, పంచె కట్టుకుని ఉన్న తనను చూసి వెనుక సీటులో కూర్చున్న సుస్మితా దేవ్ పదేపదే ‘లుంగీవాలా’ అని సంబోధించారని బ్రిట్టాస్ సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇది దక్షిణాది సంస్కృతిని, మలయాళీలను అవమానించడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను గర్వించదగ్గ భారతీయుడినని,

- మిగతా 2లో

## కంపెనీల్లో మహిళా బాస్‌లు చాలా తక్కువ.. పార్లమెంటులో కేంద్రం వెల్లడి

- దేశంలోని టాప్ 500 లిస్టెడ్ కంపెనీల్లో కేవలం 9 మందే మహిళా సీఈవోలు
- ఇదే కంపెనీల్లో 25 మంది మహిళా మేనేజింగ్ డైరెక్టర్లు
- మహిళా డైరెక్టర్లను నియమించని సంస్థలకు రూ.71 లక్షల జరిమానా
- మొత్తం కంపెనీల్లో మాత్రం 11 లక్షల మందికి పైగా మహిళా డైరెక్టర్లు



**పెన్ పవర్ డెస్క్:**భారత్‌లోని అగ్రశ్రేణి లిస్టెడ్ కంపెనీల్లో అత్యున్నత కార్యనిర్వాహక పదవుల్లో మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. టర్నోవర్ ప్రాతిపదికన టాప్ 500 కంపెనీల్లో కేవలం 9 మంది మహిళలు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లుగా (సీఈవో), 25 మంది మేనేజింగ్ డైరెక్టర్లుగా (ఎండీ) బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు తెలిపింది.

- మిగతా 2లో



## భారత్‌లో డిజిటల్ విప్లవం.. డిజిలాకర్‌కు 72 కోట్లు, ఉమంగ్‌కు 11 కోట్ల యూజర్లు!

- డిజిలాకర్ యూజర్ల సంఖ్య 72.43 కోట్లు దాటిందని కేంద్రం వెల్లడి
- గత మూడేళ్లలో ఉమంగ్ ప్లాట్‌ఫామ్‌పై దాదాపు 798 కోట్ల లావాదేవీలు
- డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా పౌర సేవలు మరింత సులభతరం
- గ్రామ పంచాయతీ స్థాయిలో 4 లక్షలకు పైగా కామన్ సర్వీస్ సెంటర్లు
- మహిళల ఆధ్వర్యంలో 70,000కు పైగా సీఎస్‌సీల నిర్వహణ

- మిగతా 2లో

## జెన్-జీకి ప్రధాని నరేంద్రమోదీ కీలక సూచన

- జీవితంలో షార్ట్‌కట్‌లు ప్రమాదకరమన్న ప్రధాని నరేంద్ర మోదీ
- సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్‌తో జాగ్రత్తగా ఉండాలని సూచన
- గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు చదవాలంటూ యువతకు హితవు
- మాజీ రాష్ట్రపతి కోవింద్ ఆత్మకథ ఆవిష్కరణ సభలో వ్యాఖ్యలు



**పెన్ పవర్ డెస్క్:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేటి తరం యువతకు (జెన్–జీ) పలు కీలక సూచనలు చేశారు. జీవితంలో అడ్డదారుల వెంట పడొద్దని, అవి అంతిమంగా తీవ్ర నష్టాలకే దారితీస్తాయని ఆయన హెచ్చరించారు. అదే సమయంలో, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బుధవారం నాడు ఢిల్లీలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథ ‘ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్’ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.
రైల్వే స్టేషన్లలో తరచూ కనిపించే ఒక హెచ్చరికను ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేశారు. “షార్ట్‌కట్ విల్ కట్ యు షార్ట్” (అడ్డదారి మీ జీవితాన్ని కుదిస్తుంది) అనే బోర్డు కేవలం రైల్వే ట్రాక్‌లకే కాకుండా, నిజ జీవితానికి కూడా వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు అందుబాటులో ఉన్నప్పటికీ, త్వరగా వెళ్లాలనే

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# రోగి ప్రాణమా... ప్రైవేట్ ఆసుపత్రి బిల్లా?

రూమ్ చార్జీలపై పార్లమెంటరీ కమిటీ సిఫార్సులు ఒక హెచ్చరిక మాత్రమే... అసలు ప్రశ్న 'మెడికల్ మాఫియా'ను ఎవరు కట్టడి చేస్తారు?

ఆసుపత్రి గుమ్మం తొక్కిన క్షణం నుంచి సామాన్యుడి గుండెల్లో ఒకటే భయం... రోగం నయం అవుతుందా? లేక బిల్లు కట్టేలోపే ఆస్తి కరిగిపోతుందా?

దేశంలో పెరుగుతున్న వైద్య ఖర్చులపై పార్లమెంటరీ స్థాయీ సంఘం చేసిన తాజా సిఫార్సులు ఈ భయానికి అద్దం పడుతున్నాయి. మెట్రో నగరాల్లోని ప్రైవేటు ఆసుపత్రుల రూమ్ చార్జీలను సమీపంలోని 3-స్టార్ హోటళ్ల సగటు అద్దెకు మించకుండా పరిమితం చేయాలని కమిటీ సూచించడం చిన్న విషయం కాదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సగటు చికిత్స వ్యయం రూ.6,631గా ఉంటే, ప్రైవేటు ఆసుపత్రుల్లో అదే రూ.50,508కు చేరుతున్నదన్న గణాంకం వైద్య రంగంలో పెరిగిన వ్యాపారీకరణకు స్పష్టమైన సంకేతం.

**అయితే... రూమ్ చార్జీలను పరిమితం చేస్తేనే సమస్య పరిష్కారమవుతుందా?**

ఖచ్చితంగా కాదు.

రోగి ఆసుపత్రిలోకి అడుగుపెట్టిన దగ్గర నుంచి బిల్లు ఎలా పెరుగుతోంది?

అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి తీసుకెళ్లిన రోగి కుటుంబానికి ముందుగా అడిగే ప్రశ్న చాలాసార్లు "ఎంత ఖర్చవుతుంది?" అన్నదే. పరిస్థితి తీవ్రంగా ఉందని చెబుతూ వెంటనే అడ్మిషన్. ఆ తర్వాత వరుసగా రక్త పరీక్షలు, స్కాన్లు, ఇతర డయాగ్నస్టిక్ పరీక్షలు. ప్రతి పరీక్షకు ప్రత్యేక బిల్లు. ఒక వైద్యుడి అభిప్రాయం తర్వాత మరో స్పెషలిస్టు. అవసరమని చెబుతూ మరిన్ని పరీక్షలు. చివరకు డిశ్చార్జ్ సమయానికి కుటుంబం ఊహించని స్థాయిలో బిల్లు చేతిలో పెట్టడం...

ఇదంతా ప్రతి ఆసుపత్రిలో జరుగుతోందని చెప్పలేం. వేలాది వైద్యులు, ఆసుపత్రులు నిబద్ధతతో సేవలందిస్తున్నాయి. కానీ కొన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం సేవ నుంచి వ్యాపార మోడల్‌గా మారుతున్నదన్న ప్రజల ఆందోళనను మాత్రం విస్మరించలేం.

'ప్యాకేజీ' పేరుతో పేదవాడి జేబుకు గండివైద్యరంగంలో పారదర్శకత అత్యంత అవసరం. ఒక ఆపరేషన్‌కు ఎంత? డాక్టర్ ఫీజు ఎంత? ఆసుపత్రి సేవా రుసుము ఎంత? మందుల ఖర్చు ఎంత? పరీక్షల ఖర్చు ఎంత? గది అద్దె ఎంత? నర్సింగ్ ఛార్జీలు ఎంత?

ఇవన్నీ ముందుగానే స్పష్టంగా చెప్పే వ్యవస్థ ఉండాలి.

రోగి ఆసుపత్రిలో ఉన్నప్పుడు అతని బలహీనతను ఆసుపత్రి బిల్లింగ్ వ్యవస్థకు బలంగా మార్చకూడదు. అత్యవసర వైద్యం కోసం వచ్చిన కుటుంబం బేరసారాలు చేసే పరిస్థితిలో ఉండదు. ఆ సమయంలో ఆసుపత్రి చెప్పిందే నిజమని నమ్మాల్సి వస్తుంది. ఈ పరిస్థితినే దుర్వినియోగం చేసే వ్యవస్థ ఎక్కడైనా ఉంటే దానిని నియంత్రించడం ప్రభుత్వ బాధ్యత.

**మెడికల్ మాఫియా అంటే కేవలం ఆసుపత్రి కాదు... ఒక వ్యవస్థ**

ప్రైవేటు వైద్య రంగంపై విమర్శలు వచ్చిన ప్రతిసారీ మొత్తం వైద్య వృత్తినే నిందించడం సరికాదు. అసలు సమస్య ఎక్కడుందో గుర్తించాలి. అనవసర పరీక్షలు, అవసరానికి మించిన చికిత్సలు, అధిక ధరల మందులు, రోగికి తెలియని అదనపు ఛార్జీలు, స్పష్టత లేని ప్యాకేజీలు, ముందస్తు అంచనా లేకుండా పెరుగుతున్న బిల్లులు-ఇలాంటి అంశాలపై కఠినమైన నియంత్రణ అవసరం. వైద్యం వ్యాపారం కావచ్చు... కానీ రోగి నిస్సహాయత మాత్రం వ్యాపార వస్తువు కాకూడదు.

**హోటల్‌తో ఆసుపత్రిని పోల్చడం సరైనదా?**

ఆసుపత్రి యాజమాన్యాలు చెబుతున్న అభ్యంతరంలో కూడా కొంత వాస్తవం ఉంది. హోటల్ గది, ఆసుపత్రి గది ఒకటి కాదు. ఆసుపత్రిలో నర్సింగ్, వైద్య పర్యవేక్షణ, అత్యవసర సదుపాయాలు, పరిశుభ్రత, వైద్య పరికరాలు వంటి అదనపు సేవలు ఉంటాయి. కానీ అదే సమయంలో ఈ వాదన పేరుతో అనియంత్రిత రూమ్ చార్జీలకు తలుపులు తెరిచి ఉంచడం కూడా సమర్థనీయం కాదు. కాబట్టి పరిష్కారం హోటల్ అద్దెను యథాతథంగా అమలు చేయడం మాత్రమే కాకుండా, ఆసుపత్రుల రూమ్ కేటగిరీలకు శాస్త్రీయమైన ధరల ప్రమాణాలు రూపొందించడం కావాలి.

**ఇంకా ముఖ్యమైనది-పరీక్షల ధరల నియంత్రణ**

పార్లమెంటరీ కమిటీ సూచించిన మరో అంశం అత్యంత కీలకం. చికిత్సతో పాటు వ్యాధి నిర్ధారణ పరీక్షల ధరలను కూడా నియంత్రించేందుకు చట్టబద్ధమైన వ్యవస్థ అవసరం.

ఒకే నగరంలో, ఒకే రకమైన పరీక్షకు వేర్వేరు ఆసుపత్రుల్లో భారీగా ధరల తేడా ఉంటే సామాన్యుడు ఎవరిని నమ్మాలి?ప్రతి ముఖ్యమైన పరీక్షకు రాష్ట్రాల వారీగా లేదా ప్రాంతాల వారీగా గరిష్ఠ ధరల పరిమితి ఉండాలి.ఆ ధరలు ఆసుపత్రులలో, వెబ్‌సైట్లలో, బిల్లింగ్ కౌంటర్లలో స్పష్టంగా కనిపించేలా చేయాలి.

**'ఎంత ఖర్చవుతుంది?' అని అడిగే హక్కు ప్రతి రోగిదే**

చికిత్స ప్రారంభించే ముందు సాధ్యమైనంతవరకు అంచనా వ్యయాన్ని రోగి కుటుంబానికి తెలియజేయాలి. చికిత్స మధ్యలో అనూహ్య మార్పులు వచ్చినప్పుడు వాటి కారణాన్ని, అదనపు ఖర్చును వివరించాలి.

రోగి కుటుంబానికి వివరమైన, అర్థమయ్యే బిల్లు ఇవ్వడం తప్పనిసరి కావాలి.

అదే సమయంలో అత్యవసర పరిస్థితుల్లో ముందుగా డబ్బు కట్టలేదనే కారణంతో ప్రాణరక్షక చికిత్సను నిరాకరించే పరిస్థితులు రాకుండా కూడా బలమైన నిబంధనలు అవసరం.

**ఆరోగ్యం హక్కా? లేక కొనగలిగిన వస్తువా?**

**ఈ ప్రశ్న ఇప్పుడు దేశం ముందుంది.**

డబ్బున్నవాడికి అత్యుత్తమ వైద్యం... డబ్బులేని వాడికి అప్పు చేసి వైద్యం... అప్పు కూడా దొరకని వాడికి విధి నిర్ణయం-ఇలాంటి పరిస్థితి ఒక సంక్షేమ రాజ్యానికి గర్వకారణం కాదు.ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడం, వైద్య సిబ్బందిని పెంచడం, అత్యాధునిక పరికరాలు అందించడం, మందులు అందుబాటులో ఉంచడం వంటి చర్యలతో పాటు ప్రైవేటు వైద్య రంగంలో పారదర్శకత, ధరల నియంత్రణ, రోగి హక్కుల పరిరక్షణ కూడా సమాంతరంగా జరగాలి. పార్లమెంటరీ కమిటీ సిఫార్సులు ఒక మంచి ప్రారంభం. కానీ అవి కాగితాలకే పరిమితమైతే ప్రయోజనం లేదు.ఆసుపత్రి బిల్లు చూసి రోగి కుటుంబం మరోసారి అనారోగ్యానికి గురికాకుండా ఉండే రోజే నిజమైన వైద్య సంస్కరణలకు నాంది.

**ప్రాణాలను కాపాడాల్సిన వైద్య వ్యవస్థ...**

ప్రాణం మీద పడే ఆర్థిక భారానికి కారణం కాకూడదు.ప్రైవేటు ఆసుపత్రులపై ఆరోపణలు చేయడం సులభం.వ్యవస్థను ప్రక్షాళన చేయడం కష్టం.అందుకే ఇప్పుడు ప్రభుత్వానికి కావాల్సింది కేవలం సిఫార్సుల అమలు కాదు-వైద్యం పేరుతో జరిగే దోపిడీకి అడ్డుకట్ట వేసే సమగ్ర చట్టబద్ధ వ్యవస్థ.

రోగి ముందుగా... లాభం తర్వాత.

వైద్యం సేవగా నిలవాలి... వ్యాపార దందాగా మారకూడదు.

# ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా గొంతు నొక్కుతున్నారు..

- మొదటి పేజి తరువాయి

వివరించారు.ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకాలకు సంబంధించి 13 త్రైమాసికాల బకాయిలు పేరుకుపోయాయని, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జగన్ అన్నారు. సుమారు రూ. 9,100 కోట్లు, రూ. 3,300 కోట్ల బకాయిలు ఉండగా, ప్రభుత్వం కేవలం రూ. 2,900 కోట్లు విడుదల చేసిందని విమర్శించారు. ఈ అంశాన్ని మండలిలో లేవనెత్తి చర్చకు పట్టుబట్టాలని ఎమ్మెల్సీలకు సూచించారు. రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదని, పంటలకు నీరందడం లేదని, ఉచిత పంటల బీమా నిలిపివేయడంతో అన్నదాతలు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. పీపీపీ ప్రాజెక్టుల పేరుతో ప్రైవేటు సంస్థలకు రాయితీలు కల్పిస్తూ ప్రజలపై భారం మోపుతున్నారని, ప్రభుత్వ సేవల ప్రైవేటీకరణను గట్టిగా ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. దిశ చట్టం రద్దు, ప్రభుత్వ విధానాలను ప్రశ్నించిన బీసీ నేతలు చింతడ రవి, ముస్తఫాలపై అక్రమ కేసులు బనాయించడం వంటి అంశాలను సభలో ప్రస్తావించాలని ఆయన ఆదేశించారు. జూనియర్ డాక్టర్ల సమ్మె, ఉద్యోగులు, మహిళలు, యువతలో ఉన్న అసంతృప్తిని కూడా మండలిలో ఎత్తిచూపాలని, పూర్తి ఆధారాలతో సభకు వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని జగన్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

# డిసెంబరు నుంచి ఎస్క్రో ఖాతాల్లో ప్రోత్సాహకాలు

- మొదటి పేజి తరువాయి

అధికారులను ఆదేశించారు. ఈ విధానం ద్వారా పారదర్శకతను పెంచడంతో పాటు, నిధుల వినియోగాన్ని మరింత సమర్థవంతంగా పర్యవేక్షించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. పారిశ్రామిక ప్రగతికి ప్రోత్సాహకాలు తప్పనిసరి అని, అయితే వాటిని ఎంతవరకు ఇవ్వగలమనే అంశంపై స్పష్టమైన ప్రణాళిక ఉండాలని సీఎం సూచించారు.బుధవారం (ఆగస్టు 12) నాడు సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 20వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశం జరిగింది. ఈ భేటీలో పరిశ్రమలు, ఇంధనం, ఐటీ ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు సంబంధించి మొత్తం 25 ప్రాజెక్టులకు బోర్డు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రానికి రూ.2,08,406 కోట్ల విలువైన పెట్టుబడులు రానుండగా, తద్వారా ప్రత్యక్షంగా 21,627 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.ఇప్పటివరకు జరిగిన 20 ఎస్ఐపీబీ సమావేశాల ద్వారా మొత్తం 363 ప్రతిపాదనలకు ఆమోదం లభించిందని, తద్వారా రూ.13.78 లక్షల కోట్ల పెట్టుబడులు, 10.86 లక్షల ఉద్యోగాలు రాష్ట్రానికి రానున్నాయని అధికారులు వివరించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, కేవలం సంప్రదాయ పరిశ్రమలే కాకుండా భవిష్యత్ అవసరాలకు తగ్గట్టు గ్రీన్ అమ్మోనియా, లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్ వంటి అధునాతన రంగాలపై దృష్టి సారించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు అనుసరించాల్సిన విధానాలపై అధ్యయనం చేయాలని సూచించారు. పారిశ్రామిక ప్రాజెక్టుల వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించి, వాటిపై కొందరు పనిగట్టుకుని చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని అన్నారు.

ఉత్తరాంధ్రలో ఏర్పాటు చేస్తున్న డేటా సెంటర్లకు కేవలం 3.5 టీఎంసీల నీరు సరిపోతుందని, పోలవరం ఎడమ కాలువ ద్వారా గ్రావిటీపైనే విశాఖ పరిశ్రమలకు నీటిని అందిస్తామని స్పష్టం చేశారు.రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిని అడ్డుకునేందుకు కొందరు రాజకీయ నిరుద్యోగులు సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా కొత్త ప్రాజెక్టులను ఆయా ప్రాంతాల్లో నెలకొల్పేలా చూడాలని అన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్న రక్షణ రంగ ప్రాజెక్టులు జాతికే గర్వకారణమని, పుట్టపర్తి సమీపంలో డిఫెన్స్, హిందూపురం వద్ద ఏరోస్పేస్ ప్రాజెక్టులు ఏర్పాటు కావాలని ఆకాంక్షించారు. మూలపేట పోర్టు నిర్మాణాన్ని డిసెంబరు నాటికి పూర్తి చేసి ప్రారంభించాలని ఆదేశించారు. రాయలసీమలో పండే ఉద్యాన ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు తరలించేందుకు రోడ్, రైల్, పోర్టు కనెక్టివిటీని బలోపేతం చేయాలన్నారు. సెప్టెంబరు నాటికి 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని, 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్' కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

# జెన్-జీకి ప్రధాని నరేంద్రమోదీ కీలక సూచన

- మొదటి పేజి తరువాయి

తొందరలో కొందరు ప్రమాదకరంగా పట్టాలు దాటుతుంటారని, అటువంటి అనాలోచిత నిర్ణయాలు ప్రాణాంతకమని ఆయన హెచ్చరించారు.యువత తప్పుడు మార్గాలను వీడి, అర్థవంతమైన జీవన గమనాన్ని ఎంచుకోవాలని ప్రధాని మోదీ సూచించారు. "మీరు ఆరాధించే మహనీయుల జీవిత చరిత్రలను తప్పనిసరిగా చదవండి. వాటి ద్వారా స్ఫూర్తి పొంది సరైన మార్గాన్ని కనుగొనవచ్చు" అని ఆయన యువతకు సలహా ఇచ్చారు. ముఖ్యంగా ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేసే ఇన్‌ఫ్లుయెన్సర్ల కంటెంట్ పట్ల నిరంతరం జాగ్రత్తగా ఉండాలని ఆయన హితవు పలికారు.

# జగన్‌కు ధైర్యముంటే అసెంబ్లీకి రావాలి..

## ఆధారాలతో చర్చకు మేం సిద్ధం

- మొదటి పేజి తరువాయి

ఆమె మీడియాతో మాట్లాడుతూ జగన్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు."ఎమ్మెల్యేగా గెలిచిన వారికి తమ నియోజకవర్గ సమస్యలను శాసనసభలో ప్రస్తావించడం ప్రాథమిక బాధ్యత. కానీ జగన్‌తో పాటు వైసీపీ ఎమ్మెల్యేలు సభకు హాజరుకాకపోవడం విచారకరం. గతంలో శాసనమండలిని రద్దు చేయాలని తీర్మానం చేసిన జగన్, ఇప్పుడు అదే మండలికి తమ ప్రతినిధులను పంపుతున్నారు. కానీ ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకున్న ఎమ్మెల్యేలను మాత్రం అసెంబ్లీకి రాకుండా అడ్డుకుంటున్నారు" అని అనిత ఆరోపించారు. ప్రభుత్వంపై చేసే ఆరోపణలకు అసెంబ్లీ కంటే మెరుగైన వేదిక మరొకటి లేదని, తాము ప్రతి అంశంపై చర్చించి సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

**ఐదేళ్లలో చేయలేని వారు ఇప్పుడు ఆరోపణలు చేస్తున్నారు**

మెగా డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను హోంమంత్రి తీవ్రంగా ఖండించారు. "ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీని కూడా పూర్తి చేయలేని వైసీపీ నేతలు, ఇప్పుడు మేము పారదర్శకంగా నిర్వహిస్తుంటే నిరాధార ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉంది. డీఎస్సీపై ఆధారాలుంటే అసెంబ్లీకి వచ్చి చూపించండి. మంత్రి లోకేశ్ రాజీనామా చేయాలని, సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేయడం కేవలం రాజకీయ లబ్ధి కోసమే" అని అన్నారు.

కష్టపడి చదివి, కుటుంబాలకు దూరంగా ఉండి, కోచింగ్‌లకు వేల రూపాయలు ఖర్చు చేసి ఉద్యోగాలు సాధించిన యువత ప్రతిభను, వారి కుటుంబాల ఆనందాన్ని అవమానించేలా వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని అనిత ఆవేదన వ్యక్తం చేశారు. "మొత్తం డీఎస్సీ నియామకాలే అక్రమమని మాట్లాడితే, ఉద్యోగం సాధించిన వారి కష్టాన్ని, ప్రతిభను కించపరిచినట్లే. రాజకీయాల కోసం యువత భవిష్యత్తుతో, వారి మనోభావాలతో ఆడుకోవద్దు" అని హితవు పలికారు.

**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం**

అంతకుముందు, హోంమంత్రి అనిత పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి సమస్యలను ఓపికగా విని, మొత్తం 65 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని హామీ ఇచ్చారు. 'మాషా అల్లా ఎంటర్‌ప్రైజెస్' బాధితులు తమ గోడును వెళ్లబోసుకోగా, ప్రభుత్వం ఇప్పటికే డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసిందని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని, ఆర్థిక మోసాలకు పాల్పడే వారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.అలాగే, నాయుడుపేట నుంచి వచ్చిన ఓ తండ్రి తన కుమార్తె చదువు, తన ఉపాధి గురించి మంత్రి దృష్టికి తీసుకురాగా, ఆమె వెంటనే స్పందించారు. చిన్నారిని హాస్టల్‌లో చేర్పించి చదువు కొనసాగించేలా చూడాలని, తండ్రికి ఉపాధి కల్పించే అంశాన్ని పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను మానవీయ కోణంలో పరిష్కరించడమే తమ ప్రభుత్వ బాధ్యత అని అనిత పేర్కొన్నారు.

# చంద్రబాబు ఒక విజనరీ లీడర్

- మొదటి పేజి తరువాయి

అని స్పష్టం చేశారు. సాంకేతికత, పాలన, మౌలిక సదుపాయాల కల్పనలో ఆయన చేపట్టిన సంస్కరణలు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు నడిపిస్తున్నాయని పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధికి, ముఖ్యంగా అమరావతి నిర్మాణానికి, ఐటీ, పారిశ్రామిక రంగాల పురోగతికి చంద్రబాబు చేస్తున్న కృషి అభినందనీయమని రాష్ట్రపతి అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా దూరదృష్టి కలిగిన నాయకత్వంతో ఏపీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రపతి నుంచి వచ్చిన ఈ ప్రశంసలపై టీడీపీ శ్రేణులు, కూటమి నాయకులు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును విజయనగరం టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తన కుటుంబంతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతికి 'అమరావతి' కాఫీ టేబుల్ బుక్‌ను బహూకరించారు. ఆ పుస్తకంలోని రాజధాని అమరావతి విశేషాలు, ఫొటోలను రాష్ట్రపతి ఎంతో ఆసక్తిగా తిలకించారు. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టిని కొనియాడుతూ, ఆయన నిజమైన అభివృద్ధికి చిరునామా అని, ఒక విజనరీ లీడర్ అని రాష్ట్రపతి ప్రశంసల వర్షం కురిపించారు. అంతేకాకుండా, ఎంపీ అప్పలనాయుడి నిబద్ధతను రాష్ట్రపతి ప్రత్యేకంగా అభినందించారు. పార్లమెంట్ సమావేశాలకు ప్రతిరోజూ సైకిల్‌పై రావడం, 100 శాతం హాజరు నమోదు చేసుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. సంస్కారం, నిరాడంబరత కలిగిన అప్పలనాయుడిని చూస్తుంటే "నన్ను నేను చూసుకున్నట్లే ఉంది" అని అన్నారు.

# కంపెనీల్లో మహిళా బాస్‌లు చాలా తక్కువ.. పార్లమెంటులో కేంద్రం వెల్లడి

- మొదటి పేజి తరువాయి

ఈ మేరకు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా సోమవారం లోక్‌సభకు రాతపూర్వక సమాధానం ఇచ్చారు.ఎంసీఏ21 డేటాబేస్ గణాంకాల ప్రకారం, ఈ 500 కంపెనీల్లో మొత్తంగా 860 మంది మహిళలు బోర్డు సభ్యులుగా, డైరెక్టర్లుగా ఉన్నారు. వీరిలో 738 మంది డైరెక్టర్లు, 67 మంది పూర్తికాల డైరెక్టర్లు, 18 మంది అదనపు డైరెక్టర్లు, 12 మంది నామినీ డైరెక్టర్లుగా వ్యవహరిస్తున్నారు. అలాగే, 22 మంది మహిళలు చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్లుగా (సీఎఫ్ఓ) బాధ్యతలు నిర్వర్తిస్తున్నట్లు మంత్రి వివరించారు.

కంపెనీల చట్టం-2013 నిబంధనల ప్రకారం, ప్రతి లిస్టెడ్ కంపెనీ బోర్డులో కనీసం ఒక మహిళా డైరెక్టర్‌ను నియమించడం తప్పనిసరి. ఈ నిబంధన అమలులోకి వచ్చిన తర్వాత బోర్డు స్థాయిలో మహిళల సంఖ్య పెరిగినప్పటికీ, సీఈవో, ఎండీ వంటి కీలక పదవుల వద్దకు వచ్చేసరికి వారి సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. అయితే, మహిళా డైరెక్టర్లు ఉన్నత నాయకత్వ స్థానాలకు ఎదగడానికి ఎదురవుతున్న అడ్డంకులపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి ప్రత్యేక అధ్యయనం నిర్వహించలేదని, కొత్త విధానాలు లేదా ప్రోత్సాహకాలు ఏవీ ప్రస్తుతం పరిశీలనలో లేవని మల్హోత్రా స్పష్టం చేశారు.మరోవైపు, మహిళా డైరెక్టర్లను నియమించడంలో విఫలమైన కంపెనీలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. 2021-22 నుంచి 2025-26 మధ్య కాలంలో నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలకు సంబంధించి మొత్తం 50 ఉత్తర్వులు జారీ అయ్యాయని, ఆయా సంస్థలపై రూ. 71.01 లక్షల జరిమానా విధించినట్లు మంత్రి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం క్రియాశీలకంగా ఉన్న మొత్తం కంపెనీల్లో సుమారు 39 లక్షల మంది డైరెక్టర్లు ఉండగా, వారిలో మహిళల సంఖ్య 11.6 లక్షలుగా ఉందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

# భారత్‌లో డిజిటల్ విప్లవం.. డిజిలాకర్‌కు 72 కోట్లు, ఉమంగ్‌కు 11 కోట్ల యూజర్లు!

దేశంలో డిజిటల్ సేవలు విస్తృతంగా ప్రజలకు చేరువవుతున్నాయని, ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ ప్లాట్‌ఫామ్‌లైన 'డిజిలాకర్', 'ఉమంగ్' అద్భుతమైన వృద్ధిని నమోదు చేస్తున్నాయని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. నేడు రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ.. గత మూడేళ్లలో డిజిలాకర్ వినియోగదారుల సంఖ్య 72.43 కోట్లకు చేరిందని, ఈ ప్లాట్‌ఫామ్‌పై 72.86 కోట్ల డాక్యుమెంట్ యాక్సెస్ లావాదేవీలు జరిగాయని వెల్లడించారు. అదే సమయంలో 'ఉమంగ్' ప్లాట్‌ఫామ్‌లో 11.66 కోట్లకు పైగా యూజర్లు నమోదు కాగా, సుమారు 798 కోట్ల లావాదేవీలు నమోదైనట్లు వివరించారు.ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచనలకు అనుగుణంగా, టెక్నాలజీని సామాన్య ప్రజలకు దగ్గర చేసే లక్ష్యంతో 2015 జులైలో 'డిజిటల్ ఇండియా' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు మంత్రి గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పౌర కేంద్రీకృత సేవలను సులభంగా అందించేందుకు అనేక చర్యలు తీసుకున్నామన్నారు. ఈ ఏడాది జులై 31 నాటికి దేశవ్యాప్తంగా ఉమాంగ్ ప్లాట్‌ఫామ్‌పై 2,575 సేవలు (కేంద్రం: 880, రాష్ట్రాలు: 1,695), డిజిలాకర్‌పై 5,437 రకాల డాక్యుమెంట్లు/సేవలు (కేంద్రం: 661, రాష్ట్రాలు: 4,776) అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో డిజిటల్ సేవలను అందించేందుకు 'కామన్ సర్వీస్ సెంటర్ల' (సీఎస్‌సీ) నెట్‌వర్క్‌ను ప్రభుత్వం విస్తరించిందని అశ్విని వైష్ణవ్ తెలిపారు. 2026 జూన్ 30 నాటికి గ్రామ పంచాయతీ స్థాయిలో 4,07,122 సీఎస్‌సీలు పనిచేస్తున్నాయని, వీటిలో 70,069 కేంద్రాలను మహిళా పారిశ్రామికవేత్తలు (విలేజ్ లెవల్ ఎంటర్‌ప్రెన్యూర్స్) నిర్వహిస్తుండటం విశేషమని అన్నారు. ప్రభుత్వ, బ్యాంకింగ్, ఆర్థిక, బీమా, పింఛను వంటి అనేక సేవలను ఈ కేంద్రాల ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు.

ఉమంగ్, డిజిలాకర్ ప్లాట్‌ఫామ్‌లు మొబైల్ యాప్‌లు, వెబ్ పోర్టల్స్ ద్వారా అందుబాటులో ఉన్నాయని, దీనివల్ల పౌరులు ఎక్కడి నుంచైనా, ఎప్పుడైనా ప్రభుత్వ సేవలను పొందవచ్చని మంత్రి వివరించారు. ఆధార్, ఈ-సైన్, ఏపీఐ సేతు వంటి కీలకమైన డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో ఈ ప్లాట్‌ఫామ్‌లను అనుసంధానించామని, తద్వారా సురక్షితమైన, కాగితరహిత సేవలు అందించడం సాధ్యమవుతోందని తెలిపారు. ఈ విధానం వల్ల భౌతికంగా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే అవసరం తగ్గి, పౌరులకు సమర్థవంతమైన సేవలు అందుతున్నాయని ఆయన స్పష్టం చేశారు.

# రాజ్యసభను కుదిపేసిన "లుంగీవాలా" వివాదం

- మొదటి పేజి తరువాయి

దక్షిణాది వాడినని పేర్కొంటూ, ఈ వ్యాఖ్యలపై సుస్మితా దేవ్‌పై హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చినట్లు వెల్లడించారు.ఈ ఆరోపణలను సుస్మితా దేవ్ తీవ్రంగా ఖండించారు. తాను అసోంకు చెందిన బెంగాలీనని, వివిధ రాష్ట్రాల వస్త్రధారణ పట్ల తనకు అపారమైన గౌరవం ఉందని స్పష్టం చేశారు. బ్రిట్టాస్ అసత్యాలు చెబుతున్నారని, ఏ విచారణలోనైనా వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆమె పేర్కొన్నారు. అంతేకాకుండా, మతపరమైన గుర్తింపులపై బ్రిట్టాస్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆయనపై ఆమె కూడా ప్రివిలేజ్ నోటీసు దాఖలు చేశారు.ఈ వివాదంపై ప్రతిపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. కొందరు ఎంపీలు పార్లమెంట్ వెలుపల పంచెకట్టుతో నిరసన తెలిపారు. సభా నాయకుడు జె.పి. నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు జోక్యం చేసుకుని, సభా మర్యాదలను కాపాడాలని సభ్యులను కోరారు. సభ్యులు ఒకరి సాంస్కృతిక సంప్రదాయాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయవద్దని సూచించిన చైర్మన్, ఇరుపక్షాలను తన ఛాంబర్‌కు పిలిచి సమస్య పరిష్కారానికి ప్రయత్నించారు. ప్రస్తుతం ఇరుపక్షాలు అందజేసిన హక్కుల ఉల్లంఘన నోటీసులు చైర్మన్ పరిశీలనలో ఉన్నాయి.

# శాసనమండలిలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం

- మొదటి పేజి తరువాయి

స్పోర్ట్స్ కోటాలో మెరిట్ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఆధారాలున్నా ప్రభుత్వం స్పందించడం లేదని బొత్స ఆరోపించారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలని, ఈ అంశంపై శాసనమండలిలో పోరాడతామని స్పష్టం చేశారు.రాష్ట్రంలో అభివృద్ధి అంతా సీఎం చంద్రబాబు కుటుంబానికి, టీడీపీ నేతలకే పరిమితమైందని విమర్శించారు. ఉద్యోగుల సమస్యలు, ప్రజా సమస్యలన్నింటినీ అసెంబ్లీ వేదికగా లేవనెత్తుతామన్నారు. 40 శాతం ఓటు షేర్ సాధించిన వైసీపీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవడం ప్రజా తీర్పును అవమానించడమేనని మండిపడ్డారు. చట్టసభల్లో నిబంధనల ప్రకారమే నడుచుకుంటామని, ప్రభుత్వాన్ని ప్రతి అంశంలో ఆధారాలతో సహా ఎండగడతామని హెచ్చరించారు.

# ఘనంగా ఎస్‌టీఎఫ్ఐ 27వ ఆవిర్భావ దినోత్సవం



**ప్యాపిలి,(పెన్ పవర్):** స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 27వ ఆవిర్భావ దినోత్సవాన్ని యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో బావిపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాలల అనంతరం సాయంత్రం 4.30 గంటలకు యూటీఎఫ్ సీనియర్ నాయకులు శివయ్య అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా యూటీఎఫ్ సీనియర్ నాయకులు గోపాల్, సర్వోత్తమ రెడ్డి, శివయ్యలు ఎస్‌టీఎఫ్ఐ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలోని ప్రధాన ఉపాధ్యాయ సంఘాలను కలుపుకుని ఎస్‌టీఎఫ్ఐ ఏర్పడిందన్నారు. దేశంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న సంఘంగా ఎస్‌టీఎఫ్ఐ ముందుకు సాగుతోందన్నారు. దేశవ్యాప్తంగా 30 ఉపాధ్యాయ సంఘాలు ఎస్‌టీఎఫ్ఐలో భాగస్వాములుగా ఉన్నాయని, ఆంధ్రప్రదేశ్‌లో యూటీఎఫ్ ప్రధాన భూమిక పోషిస్తోందన్నారు. విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై నిరంతరం పోరాటాలు కొనసాగిస్తోందని తెలిపారు. ఇటీవల దేశంలోని 13 రాష్ట్రాలకు చెందిన ఉపాధ్యాయులతో కలిసి టెట్ రద్దు కోసం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించినట్లు పేర్కొన్నారు. మారుమూల గ్రామమైన బావిపల్లిలో ఇంతటి గొప్ప సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించడం సంతోషదాయకమని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అబ్దుల్ లతీఫ్ అన్నారు.ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కౌన్సిలర్లు గోపాల్, సర్వోత్తమ రెడ్డి, మదన గోపాల్, అమీర్ బాషా, మండల కార్యవర్గ సభ్యులు ఆంజనేయ, ఇబ్రహీం, మద్దయ్య, వెంకట రమణ, శివ ప్రసాద్, యూటీఎఫ్ ప్యాపిలి మండల శాఖ సీపీఎస్ కన్వీనర్ ఆది నారాయణ, రవికుమార్, మాబుసుబహాన్, విజయ కుమార్, ఫర్హానా, సుబ్బలక్ష్మమ్మ, సుమలత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయిలో పెంచలకోన దేవస్థానానికి అగ్రస్థానం

## భక్తులకు అందుతున్న సౌకర్యాలపై నిర్వహించిన సర్వేలో ప్రథమ స్థానం



**నెల్లూరు, పెన్ పవర్ ఆగస్టు 12:** నెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం (పెంచలకోన) రాష్ట్రస్థాయిలో అరుదైన గుర్తింపు సాధించింది. రాష్ట్రంలోని 22 ప్రముఖ దేవాలయాల్లో భక్తులకు అందుతున్న సౌకర్యాలు, దర్శన విధానం, ప్రసాదం నాణ్యత, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై నిర్వహించిన సర్వేలో పెంచలకోన దేవస్థానం ప్రథమ స్థానంలో నిలిచింది. భక్తుల అభిప్రాయాలతో పాటు ఆలయంలోని మౌలిక వసతులు, దర్శన సౌకర్యాలు, పరిసరాల పరిశుభ్రత, తాగునీటి వసతి, ప్రసాదం నాణ్యత తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని సర్వే నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ అంశాల్లో పెంచలకోన దేవస్థానానికి భక్తుల నుంచి సానుకూల స్పందన లభించడంతో రాష్ట్రంలోని ఇతర ప్రముఖ ఆలయాలను అధిగమించి అగ్రస్థానం దక్కించుకుంది. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడం, ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, మౌలిక వసతులను మెరుగుపరచడం వంటి చర్యలు ఈ గుర్తింపుకు దోహదపడ్డాయని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో దేవస్థానానికి ప్రథమ స్థానం లభించడంపై భక్తులు, ఆలయ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈవో కోవూరు జనార్ధనరెడ్డి సిబ్బందిని అభినందించారు. భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. దేవస్థానానికి లభించిన ఈ గుర్తింపును నిలబెట్టుకోవడంతో పాటు భక్తుల విశ్వాసాన్ని మరింత పెంచేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆయన తెలిపారు.

పెన్ పవర్

రాయలసీమ

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా। తిరుపతి। చిత్తూరు। వై.ఎస్.ఆర్. కడప

# న్యాయం కోసం 80 ఏళ్ల వృద్ధురాలి నిరీక్షణ

### 150 అంకణాల స్థల వివాదంపై సమగ్ర విచారణ జరపాలి

### ఎస్సై లోకేష్‌కుమార్ పాత్రపై దర్యాప్తు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని బాధితురాలి డిమాండ్




**తిరుపతి, పెన్ పవర్ ఆగస్టు 12:** న్యాయం కోసం 80 ఏళ్ల వృద్ధురాలు అధికారుల చుట్టూ తిరుగుతూ చివరకు మీడియాను ఆశ్రయించారు. తనకు హక్కుగా ఉన్న 150 అంకణాల స్థలాన్ని ఇతరులకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ వ్యవహారంలో కొందరు అధికారులు, వ్యక్తుల పాత్రపై అనుమానాలు ఉన్నాయని రుద్రరాజు సంపూర్ణమ్మ ఆరోపించారు. తిరుపతి అర్బన్ మండలం అక్కారంపల్లి గ్రామ లెక్కదాఖలాలోని ఉపాధ్యాయనగర్, మారస సరోవరం హోటల్ సమీపంలో ఉన్న 150 అంకణాల స్థలానికి సంబంధించి తన వద్ద రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర ఆధారాలు ఉన్నాయని సంపూర్ణమ్మ, ఆమె కుమార్తె జి.నీరజ, అల్లుడు జి.సుకుమార్ తెలిపారు. తమ హక్కులను కాపాడాలని కోరుతూ వారు తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో తమ గోడును వెల్లడించారు. తమ స్థలంలో ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలు, సోలార్ ప్లాంట్, గదులు, మానవతా సంస్థ వాహనం కోసం నిర్మించిన షెడ్, మొక్కలు, బోరు తదితర ఆస్తులు ధ్వంసమయ్యాయని, దీనివల్ల రూ.10 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని వారు ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించి అలిపిరి పోలీస్ స్టేషన్‌లో గతంలో క్రైమ్ నంబర్ 180/2025 కింద కేసు నమోదైందని తెలిపారు. ఈ కేసుతో పాటు సంబంధిత స్థల వివాదంలో అప్పట్లో అలిపిరి పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన ఎస్సై లోకేష్‌కుమార్ సహా పలువురి పాత్రపై సమగ్ర విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. ఎస్సై లోకేష్‌కుమార్‌ను తక్షణం సస్పెండ్ చేసి, విచారణ అనంతరం బాధ్యత నిర్ధారించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబం కోరింది. ఈ వ్యవహారంలో ఎక్సైజ్ సీఐ జవహర్‌బాబు, టీటీడీ డిప్యూటీ ఈవో ఆనందరాజు తదితర అధికారుల పేర్లు కూడా ప్రస్తావించబడ్డాయి. అయితే, వీరిపై చేసిన ఆరోపణలు నిర్ధారణ కావాల్సి ఉందని బాధితులు పేర్కొన్నారు. రాజకీయ నాయకులు, ఉన్నతాధికారుల పేర్లు ప్రస్తావిస్తూ తమపై ఒత్తిడి తీసుకువస్తున్నారని సంపూర్ణమ్మ కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో సంబంధిత అధికారులు ఎలాంటి పక్షపాతం లేకుండా స్వతంత్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

**పత్రాలు, రెవెన్యూ రికార్డుల పరిశీలనకు డిమాండ్ :** వృద్ధురాలికి సంబంధించిన స్థల హక్కులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, రెవెన్యూ రికార్డులు, గతంలో జరిగిన లావాదేవీలు, పోలీస్ కేసులు, ఆస్తుల ధ్వంసానికి సంబంధించిన ఆధారాలను పూర్తిస్థాయిలో పరిశీలించాలని బాధిత కుటుంబం విజ్ఞప్తి చేసింది. బాధితురాలి ఆరోపణలు వాస్తవమా? స్థలంపై ఆమెకు ఉన్న హక్కులు ఏమిటి? ఆస్తుల ధ్వంసానికి ఎవరు బాధ్యులు? పోలీసు అధికారుల పాత్ర ఏమైనా ఉందా? అనే అంశాలపై సమగ్ర విచారణ ద్వారా స్పష్టత రావాల్సి ఉంది. వృద్ధురాలికి ఎలాంటి అన్యాయం జరగకుండా, చట్టబద్ధమైన హక్కులు కలిగిన వారికి రక్షణ కల్పించి, స్థల వివాదంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి న్యాయం చేయాలని రెవెన్యూ, పోలీస్ ఉన్నతాధికారులను బాధిత కుటుంబం కోరింది.

# శ్రీశ్రీశ్రీ చాముండేశ్వరి దేవి అమ్మవారి జయంతి మహోత్సవం





**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఆగస్టు 12 :** బుచ్చిరెడ్డిపాళెం టౌన్ కాశీపాళెం నందు వెలసియున్న శ్రీశ్రీశ్రీ చాముండేశ్వరి దేవి ఆలయం నందు అమ్మవారి జయంతి మహోత్సవం సందర్భంగా అమ్మవారికి పంచామృతాభిషేక, సుగంధ ద్రవ్య అభిషేకము నిర్వహించబడినది. అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన జరిగినది. నేటి పూజా కార్యక్రమము ఉభయదాత శ్రీమన్నే పెంచల శ్రీనివాసులు, ధర్మపత్ని మాధవి ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి పూజా కార్యక్రమంలో పాల్గొని, తీర్థ ప్రసాదములు స్వీకరించినారు. తదుపరి భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగినది. ఆలయ కమిటి వారు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించి అమ్మవారి జయంతి కార్యక్రమాన్ని పర్యవేక్షించి అమ్మవారి జయంతి కార్యక్రమాన్ని ఎంతో వైభవోపేతంగా జరిపించినారు. ఆలయ అర్చకులు శ్రీలంకా వెంకట రమణమూర్తి మాట్లాడుతూ చాముండేశ్వరి అమ్మవారు ఎంతో మహిమ గలదని, కోరిన కోర్కెలు తీర్చే కల్పతరువుగా కొంగుబంగారమై నెలకొని ఉన్నదని అమ్మవారి మహిమను కొనియాడారు.

# 22 నుంచి పీజీ పరీక్షలు

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలో పలు పీజీ కోర్సులకు సంబంధించి రెండవ సెమిస్టర్‌ను ఈనెల 22 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పరీక్షల డీన్ ఆచార్య సురేంద్ర బాబు, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాజమాణిక్యం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే అన్ని సబ్జెక్టుల మొదటి సెమిస్టర్ ఫలితాలను ఈ వారంలో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు.

# ప్రతి హామీ నిలబెట్టుకున్నాం... సూపర్ సిక్స్ పథకాలతో ఇంటింటికీ సంక్షేమం

### రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం' ఇంటింటి ప్రచారంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

### చౌకచర్ల పంచాయతీలో రూ.2.90 కోట్ల అభివృద్ధి, సంక్షేమ పనులు

### సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్

### రైతులకు సమయానికి యూరియా, చివరి ఆయకట్టు వరకు సాగునీరు

### 22 పేద కుటుంబాలకు రూ.16.85 లక్షల సీఎంర్ఫ్ సాయం



**కోవూరు పెన్ పవర్ ఆగస్టు 12. :** ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను దాదాపు నెరవేర్చి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నామని, అందుకే ఇంటింటికీ వెళ్లినప్పుడు ప్రజలు ఆనందంగా స్వాగతం పలుకుతున్నారని కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. బుధవారం విడవలూరు మండలం చౌకచర్ల పంచాయతీలో నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం' ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తూ, రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం వైపు నడిపిస్తున్నారని అన్నారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించాలని, ప్రజల సమస్యలను తెలుసుకుని రాబోయే మూడేళ్లలో వాటిని పరిష్కరించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారని తెలిపారు. కోవూరు నియోజకవర్గంలో '2 ఏళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం ఇంటింటి ప్రచారం దాదాపు 90 శాతం పూర్తయిందని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్న ప్రతి నాయకుడు, కార్యకర్తకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు

**సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ :** చౌకచర్ల పంచాయతీలో ఇంటింటికీ వెళ్లినప్పుడు ప్రజలు ఆనందంగా కనిపిస్తున్నారని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను దాదాపు నెరవేర్చడమే ఇందుకు కారణమని ఎమ్మెల్యే అన్నారు. సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశామని పేర్కొన్నారు. చెప్పిన మాట ప్రకారం పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచామని, తల్లికి వందనం ద్వారా కుటుంబంలో చదువుకునే ప్రతి బిడ్డకు రూ.15 వేలు అందిస్తున్నామని తెలిపారు. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని, ఇతర ప్రాంతాలకు వెళ్లి పనిచేసుకునే మహిళలకు ప్రయాణ ఖర్చుల్లో నెలకు దాదాపు రూ.1,500 వరకు ఆదా అవుతోందని చెప్పారు. అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు అండగా నిలిచామని, డెల్టా ప్రాంతమైన కోవూరులో రైతులకు ఇబ్బందులు లేకుండా సమయానికి యూరియా అందించామని తెలిపారు. కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసి 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కోవూరు నియోజకవర్గంలో చివరి ఆయకట్టు వరకు రెండో పంటకు సాగునీరు అందించామని తెలిపారు. ఇవన్నీ సాధ్యమయ్యేలా సహకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నియోజకవర్గం తరఫున ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా చంద్రబాబు నాయుడు పెద్ద దిక్కుగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. చౌకచర్ల గ్రామంలో 22 కుటుంబాలకు రూ.16.85 లక్షల విలువైన సీఎంర్ఫ్ చెక్కులు అందించామని తెలిపారు.

**చౌకచర్లలో రూ.2.90 కోట్ల అభివృద్ధి పనులు :** గడిచిన రెండేళ్ల కాలంలో చౌకచర్ల పంచాయతీ పరిధిలో మొత్తం రూ. 2,90,40,000 విలువైన సంక్షేమ, అభివృద్ధి పనులు చేపట్టినట్లు ప్రశాంతి రెడ్డి గణాంకాలతో వివరించారు. ఇరిగేషన్ శాఖ ద్వారా రూ. 58,35,000 వెచ్చించగా, ఇందులో చౌకచర్ల చెరువు కాలువ, తూము కాలువల్లో గుర్రపు డెక్క తొలగింపునకు రూ. 13,50,000, తూము షట్టర్ మరమ్మతుకు రూ. 5,00,000, నీటి సరఫరా కాలువ అభివృద్ధికి రూ. 15,00,000 కేటాయించారు. అలాగే స్లూయిస్ కాలువల పునరుద్ధరణ, రక్షణ గోడల నిర్మాణానికి రూ. 14,90,000, ఆయకట్టు రహదారి మరమ్మతులకు రూ. 9,95,000 ఖర్చు చేశారు. విద్యుత్తు శాఖ పరిధిలో ఏకంగా రూ. 1,09,20,000 విలువైన పనులు చేపట్టగా, ఆర్డీఎస్ఎస్ కింద రూ. 60,00,000తో పనులు నిర్వహించారు. విద్యుత్ పోల్స్, కండక్టర్ రీప్లేస్‌మెంట్‌కు రూ.2,20,000 వెచ్చించడంతో పాటు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద 47 ఇళ్లకు రూ. 47,00,000 అంచనా వ్యయంతో సోలార్ రూఫ్‌టాప్ కనెక్షన్లు కల్పించారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రూ. 56,00,000 కేటాయించి, పసలవారిపాళెం, మిక్స్డ్ కాలనీలలో 4 సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 20,00,000, ఐదేళ్లుగా అసంపూర్తిగా ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు రూ. 36,00,000 వ్యయం చేశారు. తాగునీరు, పారిశుద్ధ్య రంగాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా రూ. 50,00,000 ఖర్చు చేయగా, ఇందులో సైడ్ డ్రెయిన్ల నిర్మాణానికి రూ. 32,00,000, తాగునీటి బోర్లు, పైప్‌లైన్ల ఏర్పాటుకు రూ. 18,00,000 వినియోగించారు. ఇవే కాకుండా గ్రామంలో సొంత స్థలం ఉన్న 76 పేద కుటుంబాల ఇళ్ల నిర్మాణ ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపామని, త్వరలోనే ఇవి మంజూరవుతాయని ఎమ్మెల్యే వెల్లడించారు.

**స్థానిక సమస్యల పరిష్కారానికి హామీ :** ఇంటింటి ప్రచారంలో భాగంగా స్థానిక ప్రజలు కాలువలు, రోడ్ల నిర్మాణంతో పాటు వాటర్ పంపు, వాటర్ ప్లాంట్ మరమ్మతులు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యలను త్వరలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ప్రశాంతి రెడ్డి హామీ ఇచ్చారు.

# పాసు పుస్తకాలు ఇళ్ల పట్టాలు పంపిణీ : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**పాసు పుస్తకాలు, ఇళ్ల పట్టాలు పంపిణీ కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**
**కోవూరు గ్రామంలో 939 మంది రైతులకు పాసు పుస్తకాలు**
**50 మంది పేదలకు ఇళ్ల పట్టాలు**

**కోవూరు పెన్ పవర్ ఆగస్టు 12 :** రైతు భూమికి రక్షణ కల్పించడం, రైతు హక్కుకు భరోసా ఇవ్వడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. బుధవారం కోవూరు ఎమ్మార్వో కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన పట్టాదారు పాసుపుస్తకాలు, ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అధికారంలోకి రాగానే భూ సమస్యలను పరిష్కరిస్తామని, రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు ఇస్తామని, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం తప్పిదాల వల్ల అనేక ప్రాంతాల్లో రైతుల సొంత భూములు కూడా 22(ఏ) నిషేధిత జాబితాలోకి వెళ్లాయని తెలిపారు. కోవూరు నియోజకవర్గంలోనూ ఇలాంటి సమస్యలు ఉన్నాయని చెప్పారు. ఇటీవల కొత్తవంగల్లు సమీప గ్రామాల రైతులు తమ సమస్యను తన దృష్టికి తీసుకువచ్చారని, సుమారు 90 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న దాదాపు 400 ఎకరాలు 22( ఏ)లోకి వెళ్లిన విషయాన్ని రైతులు తెలిపారని వివరించారు. ఈ సమస్యను కలెక్టర్ జాయింట్ కలెక్టర్ స్థానిక ఎమ్మార్వో దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. రీసర్వే ద్వారా రైతులకు న్యాయం జరుగుతుందనడానికి ఇదొక నిదర్శనమని అన్నారు.



**939 మంది రైతులకు రాజముద్రతో పాసు పుస్తకాలు :** కోవూరు గ్రామంలో 5,554 ఎకరాలకు రీసర్వే పూర్తి చేశామని, ఇందులో 3,917 ఎకరాల పట్టా భూములకు సంబంధించి 939 మంది రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను ఈ రోజు అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ పాసుపుస్తకాల్లో రాష్ట్ర రాజముద్రతో పాటు హై-సెక్యూరిటీ యాంటీ ట్యాంపర్ డిజైన్, క్యూఆర్ కోడ్, జియో కోఆర్డినేట్స్ వంటి ఆధునిక భద్రతా ఫీచర్లు ఉన్నాయని చెప్పారు. కోవూరు మండలంలో ఇప్పటికే 9 గ్రామాల్లో రాజముద్రతో కూడిన పాసుపుస్తకాలను పంపిణీ చేశామని తెలిపారు. సాదాబైనామా భూములకు కూడా పాసుపుస్తకాలు అందించే చర్యలు జరుగుతున్నాయని చెప్పారు. 22( ఏ)లో ఉన్న పట్టా భూముల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ఆర్డీవోలకు ప్రభుత్వం అధికారాలు ఇచ్చిందని ఎమ్మెల్యే తెలిపారు. కోవూరు నియోజకవర్గం ప్రధానంగా డెల్టా ప్రాంతం కావడంతో రైతులకు భూమి హక్కులకు సంబంధించిన ఈ కార్యక్రమం ఎంతో ముఖ్యమైనదని అన్నారు. రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు అందించేందుకు కృషి చేస్తున్న అధికారులు, ప్రభుత్వానికి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. రైతు భూమికి రక్షణ... రైతు హక్కుకు భరోసా... ఇదే మన ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

**50 మంది పేదలకు ఇళ్ల పట్టాలు :** ఇటుక బట్టీల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్న 50 మంది పేదలకు ఈ రోజు ఇళ్ల పట్టాలు కూడా పంపిణీ చేశామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన గిరిజన నాయకులు బాల చిన్నయ్య గారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం తరఫున, అలాగే వీపీఆర్ ఫౌండేషన్ తరఫున గిరిజనులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాఘవేంద్ర ఎస్సీ నాయకులు బాల చిన్నయ్య కూటమి నాయకులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## నల్లపరెడ్డి రజత్ రెడ్డిని కలిసిన పంచేడు వైసీపీ నాయకులు.



**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఆగస్టు 12.** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.యస్ జగన్ మోహన్ రెడ్డి మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి తనయుడు నల్లపరెడ్డి రజత్ కుమార్ వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా నియమించిన సందర్భంగా నేడు నెల్లూరులోని వారి నివాసంలో బుచ్చిరెడ్డిపాళెం పంచేడు గ్రామానికి చెందిన వైసీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి తుమ్మల ప్రసాద్ రెడ్డి వైసీపీ నాయకులు పెనాక భాస్కర్ రెడ్డి, పెనాక సుధాకర్ రెడ్డి, కొట్టా విజయ్, రోకటి మదన్, కాగల్లు సీనయ్య, మోర హరి, తువ్వర మనోహర్, తువ్వర రాజయ్య, తువ్వర పెద్ద రమణయ్య, తువ్వర వాసు, కాగొల్లు రమణయ్య, కాగుల్లు వెంకయ్య, బండి వినోద్, పాత్ర వెంకటేశ్వర్లు, యాలసిరి ప్రసాద్, యాలసిరి రమణయ్య, ఈగ చెంచమ్మ, మసునూరి అశోక్, నెల్లూరు సునీల్ మరియు తదితరులు రజత్ రెడ్డి సన్మానించి శుభాకాంక్షలు తెలపడం జరిగింది..

# దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సంకల్పం చేయాలి



**నెల్లూరు, పెన్ పవర్ ఆగస్టు 12:** దేశాభివృద్ధిలో ప్రతి పౌరుడిని భాగస్వామ్యం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "అనే నేను" కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం నెల్లూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమాన్ని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించి, "అనే నేను" కార్యక్రమంపై తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2047 నాటికి 100 సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో, అప్పటికి వ్యక్తిగా తాము, తమ ప్రాంతం, రాష్ట్రం, దేశం ఏ విధంగా అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నారో ప్రజలు తమ అభిప్రాయాలను సామాజిక మాధ్యమాల ద్వారా తెలియజేయాలని కోరారు. అలాగే ప్రాంతీయ, రాష్ట్ర, దేశ అభివృద్ధిలో తాము ఏ విధంగా భాగస్వాములు కావాలనుకుంటున్నారో "అనే నేను" శీర్షికతో సోషల్ మీడియా పోస్టుల ద్వారా తమ సంకల్పాన్ని వెల్లడించాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవం నాటికి ప్రజలు స్వచ్ఛందంగా తమ అభిప్రాయాలు, సంకల్పాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రజలు తమ పోస్టులను #ApGovernmentOfficial, #IndependenceDay2026, #MyIndiaMyVision, #PartnersInNationBuilding, #ApOfficialNews హ్యాష్‌ట్యాగ్‌లతో జత చేసి సామాజిక మాధ్యమాల్లో ప్రచురించాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కోరారు.

# ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్న కూటమి ప్రభుత్వం

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు నాణ్యమైన వైద్యంతో పాటు పౌష్టికాహారం : ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ**





**నాయుడుపేట,పెన్ పవర్, ఆగష్టు 12 :** ప్రజారోగ్యానికి ప్రాధాన్య ఇస్తున్న కూటమి ప్రభుత్వ పాలనలో ఆసుపత్రుల్లో రోగులకు నాణ్యమైన వైద్యంతోపాటు పౌష్టికాహారాన్ని కూటమి ప్రభుత్వం అందిస్తుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలియజేశారు. బుధవారం నాయుడుపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న ఇన్‌పేషెంట్ రోగులకు ఉచిత భోజన వసతిని డా.నెలవల విజయశ్రీ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే వారిలో ఎక్కువ మంది సామాన్య,పేద,మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారని, అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన వారికి వైద్య సేవలతో పాటు పౌష్టికరమైన ఆహారం అందించడం ముఖ్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న ఇన్‌పేషెంట్లకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం,రాత్రి భోజనం ఉచితంగా అందించే డైట్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని బట్టి వైద్యుల సూచనల మేరకు అవసరమైన ప్రత్యేక ఆహారాన్ని కూడా అందించాలని సూచించారు. మందులు ఎంత ముఖ్యమో, రోగి త్వరగా కోలుకోవడానికి పౌష్టికాహారం కూడా అంతే ముఖ్యం అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, మెనూ ప్రకారం రోగులకు నాణ్యమైన, పరిశుభ్రమైన,పౌష్టికమైన భోజనాన్ని సకాలంలో అందించాలని సంబంధిత నిర్వాహకులకు సూచించారు. ఆసుపత్రి వైద్యులు,సిబ్బంది భోజనం నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేద ప్రజలకు మెరుగైన వైద్యం,మందులు, పరీక్షలు,భోజనం,అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట పట్టణ టిడిపి అధ్యక్షులు షేక్ రఫీ,పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి అవధానం సుధీర్,ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు జివిఆర్ నాయుడు,సంపూర్ణమ్మ, తెలుగుదేశం పార్టీ నాయకులు నానబాల సుబ్బారావు,నిత్యా కృష్ణారెడ్డి,కాపులూరు చక్రపాణి,పలుకూరు ముత్యాలయ్య,మొండెం బాబు బల్లి ముత్యాలయ్య,గోను బాబు,ఇమ్మడిశెట్టి వెంకటేశ్వర్లు, వాకిరి వెంకటేశ్వర్లు,పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పొదలకూరు అభివృద్ధిపై వైసీపీ నేతలు సమాధానం చెప్పాలి





**పొదలకూరు, పెన్ పవర్ ఆగస్టు 12:** పొదలకూరు మండల ప్రజల దశాబ్దాల నాటి సమస్యలను పరిష్కరించడంతో పాటు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసిందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. పొదలకూరులోని కాకాణి రమణారెడ్డి నగర్‌లో నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం.. అభివృద్ధి.. సంక్షేమం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలోని మరే రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని సోమిరెడ్డి పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల ద్వారా ఏడాదికి రూ.33 వేల కోట్లను లబ్ధిదారులకు అందిస్తున్నామని, పీఎం కిసాన్–అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఏడాదికి రూ.20 వేల పెట్టుబడి సాయం అందుతోందన్నారు. తల్లికి వందనం పథకం నిరుపేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా మారిందని, పొదలకూరు మండలంలోని ఓ గిరిజన కుటుంబానికి చెందిన ఐదుగురు పిల్లలకు కలిపి రూ.65 వేల లబ్ధి చేకూరిందని తెలిపారు. మహిళలకు స్త్రీశక్తి పథకం ద్వారా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందుతున్నాయని చెప్పారు. వర్షాలు లేక నిమ్మతోటలు ఎండిపోతున్నాయని రైతులు తన దృష్టికి తీసుకురాగానే కండలేరు ఎడమ కాలువ లిఫ్ట్‌ను ప్రారంభింపజేసి నీటిని అందించామని సోమిరెడ్డి తెలిపారు. కండలేరు ఎడమ కాలువలో నీటి ప్రవాహాన్ని చూస్తుంటే ఆనందంగా ఉందని, తోడేరుకు కూడా నీరు అందించామని చెప్పారు. ప్రస్తుతం నిమ్మకాయలు రూ.5 వేల వరకు ధర పలుకుతుండటం సంతోషకరమన్నారు. 2014 ఎన్నికల్లో పొదలకూరు మండలంలో వచ్చిన ప్రతికూల ఫలితాల కారణంగా తాను ఓడిపోయినా, మండల అభివృద్ధిని ఎన్నడూ నిర్లక్ష్యం చేయలేదని సోమిరెడ్డి అన్నారు. దశాబ్దాలుగా పట్టించుకోని సోమశిల దక్షిణ కాలువపై సైఫన్ నిర్మించి మండలానికి నీటిని అందించామని, కండలేరు ఎడమ కాలువపై లిఫ్ట్ ఏర్పాటు చేసి రైతులకు అవసరమైనప్పుడు నీరు అందించే పరిస్థితి కల్పించామని తెలిపారు. పొదలకూరు మండలానికి గతంలో సమితి అధ్యక్షుడిగా, జెడ్పీ చైర్మన్‌గా, రెండుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా పనిచేసిన కుటుంబం మండలానికి ఏం చేసిందో ప్రజలకు వివరించాలని సోమిరెడ్డి డిమాండ్ చేశారు. సోమశిల దక్షిణ కాలువను ఎందుకు పట్టించుకోలేదని, విద్యార్థుల కోసం ఐటీఐ ఎందుకు నిర్మించలేదని, కండలేరు ఎడమ కాలువకు లిఫ్ట్ ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. పొదలకూరులో కమ్యూనిటీ హెల్త్ సెంటర్, డయాలసిస్ కేంద్రం ఎందుకు ఏర్పాటు చేయలేకపోయారని, చిట్టేపల్లి తిప్ప వద్ద మెగా మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎందుకు నిర్మించలేకపోయారని ప్రశ్నించారు. గతంలో ఏర్పాటు చేసిన కొన్ని మౌలిక వసతుల నిర్వహణను కూడా నిర్లక్ష్యం చేశారని, ఎడమ కాలువ లిఫ్ట్ విద్యుత్ బిల్లులు చెల్లించలేదని, సోమశిల దక్షిణ కాలువ పనులకు అడ్డంకులు సృష్టించారని ఆరోపించారు. మెగా మినరల్ వాటర్ ప్లాంట్‌ను నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేర్చారని, అన్న క్యాంటీన్‌ను మూసివేశారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వచ్చే వైసీపీ నాయకులను అభివృద్ధి, సంక్షేమంపై ప్రజలు ప్రశ్నించాలని సోమిరెడ్డి పిలుపునిచ్చారు. తనపై వ్యక్తిగత విమర్శలు, దూషణలు చేయడం కాకుండా పొదలకూరు మండల ప్రజల కోసం గతంలో చేసిన అభివృద్ధి పనులపై సమాధానం చెప్పాలని అన్నారు. రాజకీయంగా తాను చేసే ప్రతి విమర్శకు ఆధారాలు, వాస్తవాలే ప్రాతిపదికగా ఉంటాయని సోమిరెడ్డి స్పష్టం చేశారు.

# వేణుంబాక కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కిలివేటి





**నాయుడుపేట, పెన్ పవర్, ఆగష్టు 12 :** నాయుడుపేట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేనుంబాక విజయశేఖర్ రెడ్డి, వేనుంబాక లక్ష్మీనారాయణ రెడ్డి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే పులివెందుల సంజీవయ్య స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు.వైసీపీ నేత వేణుంబాక విజయ శేఖర్ రెడ్డి మాతృమూర్తి మంగళవారం సాయంత్రం కన్నుమూశారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య బుధవారం నా యు డు పే ట లో ని వారి స్వగృహానికి వెళ్లి, పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరంవారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీ నాయుడుపేట పట్టణ అధ్యక్షులు కలికి మాధవ రెడ్డి వైసీపీ ఓజిలి మండల అధ్యక్షులు పాదర్తి హరినాథ్ రెడ్డి, నాయుడుపేట ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు ఈదా రత్నశ్రీ, దొరవారిసత్రం మండల అధ్యక్షులు,అల్లూరి రాహుల్ రెడ్డి, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు పాలేటి నాగార్జున, క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు భావన్ అనుదీప్,నాయకులు రాయపు శేఖర్,లక్ష్మీ ప్రసన్న, కన్మని,తదితరులు వేణుంభాక బ్రదర్స్ ను పరామర్శించారు.

## గణపవరం పీహెచ్‌సీలో డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ



**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, ఆగస్టు 12 నాదెండ్ల :** మండలంలోని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ రత్న మోహన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, రోగులకు అందుతున్న సౌకర్యాలను ఆయన పరిశీలించారు. ఓపీ సేవల కోసం ఆసుపత్రికి వచ్చిన రోగులతో డీఎంహెచ్‌ఓ నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో లభిస్తున్న సౌకర్యాలు, వైద్యుల సేవలు, మందుల అందుబాటు తదితర అంశాలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలోని వివిధ రికార్డులను పరిశీలించిన ఆయన, సిబ్బంది పనితీరును సమీక్షించారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## ట్రాఫిక్ నియంత్రణపై ఆర్టీసీ డిపో మేనేజర్ పర్యవేక్షణ



**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 12: చిలకలూరిపేట :** ట్రాఫిక్ రద్దీని అరికట్టేందుకు మరియు బస్సుల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు ఆర్టీసీ డిపో మేనేజర్ యద్దనపూడి వేణు క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ ను కంట్రోల్ చేసే క్రమంలో భాగంగా, ఆయన గుంటూరు రోడ్డులో రద్దీగా ఉండే తిమ్మాపురం స్టేజి వద్దకు స్వయంగా వెళ్లి బస్సుల కదలికలను పర్యవేక్షించారు . రహదారిపై ఇతర వాహనదారులకు ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా బస్సులను సరైన క్రమంలో నిలుపుదల చేసేలా డ్రైవర్లకు మరియు కండక్టర్లకు ఆయన అక్కడికక్కడే అవసరమైన సూచనలు అందించారు. ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించడంతో పాటు, ప్రధాన రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడటమే లక్ష్యంగా డిపో మేనేజర్ ఈ పర్యవేక్షణ చేపట్టినట్లు తెలిసింది.

## ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించిన ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 12,** రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన రెండేళ్ల పాలన-ఇంటింటికి ప్రచారంలో భాగంగా బుధవారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలో "మన ఇంటికి- మన నసీర్" కార్యక్రమం 50వ వార్డులోని గడ్డిపాడు గణేష్ నగర్ లో ఉత్సాహంగా సాగింది., అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ లీడర్ నుంచి కేడర్ వరకు ఉత్సాహంతో ముందుకు కదిలారు. ప్రతి గుమ్మానికి వెళ్లి ఎమ్మెల్యే నసీర్ ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అవకాశం ఉన్న ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఇంటి వద్దకే సంక్షేమాన్ని తీసుకొస్తున్నామన్నారు. ఇది మనసున్న ప్రభుత్వమని, ప్రజల సంతోషమే ధ్యేయంగా పని చేస్తోందని తెలిపారు. నియోజకవర్గంలో ప్రజల మంచినీటి అవసరాలకు శాశ్వత నిర్మాణాలు చేపట్టామన్నారు. దీంతోపాటు పార్కుల అభివృద్ధి, వాకింగ్ ట్రాక్ల నిర్మాణం వంటి పనులకు ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు. ఇది కేవలం ఇంటింటికి ప్రచారమే కాదని ప్రజలకు, ప్రభుత్వానికి వారధి నిర్మిస్తున్నామని అన్నారు. ప్రజలకు ప్రభుత్వం తోడుగా నిలుస్తుందనే నమ్మకాన్ని కలిగిస్తున్నామని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రానికి రాజధాని ఎక్కడ అని గూగుల్ అడిగినా చెప్పలేని పరిస్థితి అని విమర్శించారు.కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పంతో ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణానికి శ్రీకారం చుట్టారని చెప్పారు.

# పూర్వీకుల భూమిపై అక్రమ ఆక్రమణలు

### మట్టి తవ్వకాలతో భూమి స్వరూపం మారుస్తున్నారని బాధితుల ఆరోపణ





**చీరాల, పెన్ పవర్, ఆగస్టు 12 :** పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన తమ భూమిని కొందరు అక్రమంగా ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తూ, ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపడుతున్నారని బాధితులు ఆరోపించారు. భూమిని పరిరక్షించడంతో పాటు అక్రమ ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని రెవెన్యూ, పోలీసు అధికారులను కోరారు. బాధితుల కథనం మేరకు.. పూర్వీకుల కాలం నుంచి తమ కుటుంబ ఆధీనంలో ఉన్న భూమికి సంబంధించిన హక్కులు, పత్రాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. అయితే కొందరు వ్యక్తులు భూమిలోకి ప్రవేశించి హద్దులను మార్చేందుకు ప్రయత్నించడంతో పాటు మట్టి తవ్వి తరలిస్తున్నారని ఆరోపించారు. దీంతో భూమి స్వరూపం మారిపోతుండటంతో భవిష్యత్తులో తమ హక్కులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, రెవెన్యూ రికార్డులు, సర్వే హద్దులు, సంబంధిత పత్రాలను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని బాధితులు కోరారు. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు తేలితే వెంటనే వాటిని నిలిపివేసి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పూర్వీకుల ఆస్తిని అక్రమ ఆక్రమణల నుంచి కాపాడి, భూమిలో జరుగుతున్న మట్టి తవ్వకాలను తక్షణమే నిలిపివేయాలని

# టీడీపీ నాయకులది దిగజారుడు రాజకీయం: దింటకుర్తి వీరరాఘవ



**విజయవాడ, పెన్ పవర్ ఆగస్టు 12 :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కనబెట్టి డ్రామా రాజకీయాలకు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి దింటకుర్తి వీరరాఘవ, 39వ డివిజన్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, న్యాయవాది సంక పరమేష్ విమర్శించారు. విజయవాడ విద్యాధరపురంలోని దింటకుర్తి వీరరాఘవ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో యువత, విద్యార్థులతో కలిసి నిరసనలు, ధర్నాలు కొనసాగిస్తామని వీరరాఘవ తెలిపారు. వైఎస్సార్‌సీపీ నిరసనలకు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక విజయవాడ ఎమ్మెల్యే బోండా ఉమా నిరసన దీక్షల టెంట్లు తొలగించడం, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణుపై కోడిగుడ్ల దాడి చేయించడం, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావుపై అనుచిత వ్యాఖ్యలు చేయించడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ఆరోపించారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆర్యవైశ్యులకు ప్రాధాన్యత కల్పించామని వీరరాఘవ పేర్కొన్నారు. టీటీడీ బోర్డులో రెండు పర్యాయాలు ఇద్దరేసి చొప్పున, దుర్గగుడి పాలకమండలిలో ముగ్గురికి, ద్వారకా తిరుమలలో ఐదుగురు ఆర్యవైశ్యులకు అవకాశం కల్పించిన ఘనత వైఎస్సార్‌సీపీదేనన్నారు. అమ్మఒడి, చేయూత, ఆసరా, ఈబీసీ నేస్తం వంటి పథకాల ద్వారా వైశ్య కుటుంబాలకు డీబీటీ ద్వారా ఆర్థిక ప్రయోజనం చేకూరిందని తెలిపారు.

2014–19 టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు రూ.63 కోట్లు కేటాయిస్తామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించి, ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని వీరరాఘవ విమర్శించారు. వైశ్య సమాజంపై టీడీపీ

# కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలి

### పట్టణ పేదలకు రెండు సెంట్ల ఇంటి స్థలం ఎప్పుడిస్తారు?

### సిపిఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్





**తిరుపతి, పెన్ పవర్ ఆగస్టు 12:** తిరుపతి నగరంలోని అర్హులైన పేదలకు కొత్త పింఛన్లు, రేషన్ కార్డులను తక్షణమే మంజూరు చేయాలని సిపిఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్ డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ చేపడుతున్న పాదయాత్రలో భాగంగా బుధవారం ఉదయం జీవకోన ప్రాంతంలో నిర్వహించిన పాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జల్లా విశ్వనాథ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తవుతున్నా కొత్తగా పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో వికలాంగులు, వితంతువులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అభివృద్ధి పేరుతో గొప్పలు చెప్పుకోవడం కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. అర్బన్ ప్రాంతాల్లో పేదలకు రెండు సెంట్ల ఇంటి స్థలం, ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు మంజూరు చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తిరుపతి నగరంలో రెండున్నరేళ్లు గడుస్తున్నా పేదలకు ఒక్క ఇంటి స్థలం కూడా మంజూరు కాలేదని విమర్శించారు. ఇళ్ల సమస్యపై జిల్లా కలెక్టర్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించకపోవడం విచారకరమన్నారు. జీవకోన ప్రాంతంలో గంజాయి సమస్య తీవ్రంగా ఉందని, దీని ప్రభావంతో యువత చెడు మార్గంలోకి వెళ్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులు నిరంతరం నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. రాజకీయ ముసుగులో రౌడీయిజం, భూ కబ్జాలు పెరుగుతున్నాయని, రెవెన్యూ, పోలీసు శాఖల నిర్లక్ష్యం కారణంగానే ఇటువంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆరోపించారు. తిరుపతి నగర ప్రజల సమస్యల పరిష్కారం కోసం సిపిఐ ఆధ్వర్యంలో చేపడుతున్న పాదయాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని తెలిపారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు సిపిఐ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ నెల 14న తిరుపతి నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు, ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి. ఈశ్వరయ్య హాజరవుతారని తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జల్లా విశ్వనాథ్ పిలుపునిచ్చారు. ఈ పాదయాత్రలో మహిళా సంఘం జిల్లా కార్యదర్శి బి. నదియా, నగర సహాయ కార్యదర్శి బండి చలపతి, నగర కార్యవర్గ సభ్యులు సి. రత్నమ్మ, ఎన్. మంజుల, శాఖ కార్యదర్శి కాలయ్య, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం. రామకృష్ణ, రామచంద్రయ్య, విజయమ్మ, అలివేలమ్మ, బాబు, రాము, బాదుల్లా, హరిత, ఢిల్లీ బాబు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ను సన్మానించిన టిడిపి యువనేత వేలూరు కళ్యాణ్ రెడ్డి



**నాయుడుపేట,పెన్ పవర్, ఆగష్టు 12 :** మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ను తెలుగుదేశం పార్టీ యువనేత వేలూరు కళ్యాణ్ రెడ్డి ఘనంగా సన్మానించారు.బుధవారం సాయంత్రం నాయుడుపేట పట్టణంలో గాంధీ పార్క్ వద్ద సుమారు 60 లక్షల రూపాయలు నిర్మించిన సిమెంటు రోడ్డు ను ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయ శ్రీ స్థానిక కూటమి పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం కు టిడిపి యువనేత వేలూరు కళ్యాణ్ రెడ్డి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

## నాలుగు రోజుల్లో ముగియనున్న పంట బీమా నమోదు గడువు..!

**పెడన, పెన్ పవర్, ఆగష్టు 12 :** పెడన మండలం మడక గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పంటల సాగు, పంటల బీమాపై అవగాహన కల్పించారు. పంటల బీమా నమోదు గడువు మరో నాలుగు రోజుల్లో ముగియనున్నందున అర్హులైన రైతులంతా సకాలంలో నమోదు చేసుకోవాలని పెడన వ్యవసాయ అధికారి ఎస్. జెన్నీ సూచించారు. బీమా చేయించుకోని రైతులు వెంటనే సంబంధిత వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి నమోదు పూర్తి చేసుకోవాలని తెలిపారు. నీటి సమస్య ఉన్న పొలాల్లో పొటాషియం నైట్రేట్‌ను పిచికారీ చేయడం ద్వారా పంటకు అవసరమైన పోషకాలు అందుతాయని వివరించారు. పొలాల్లో కలుపు సమస్య ఉన్న చోట్ల సకాలంలో కలుపు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. వరి పంటలో 30 రోజుల దశలో కలుపు నియంత్రణకు సిఫారసు చేసిన మందులను వ్యవసాయ

## ఎమ్మెల్యే డా.నెలవల విజయ శ్రీ ని సన్మానించిన టిడిపి నేత పోట్లపూడి రాజేష్



**నాయుడుపేట, పెన్ పవర్, ఆగష్టు 12 :** సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీని టిడిపి నేత, ఎస్ జె జ్యువలరీస్ అధినేత పోట్లపూడి రాజేష్ ఘనంగా సన్మానించారు. బుధవారం నాయుడుపేట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన భోజన పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ కి టిడిపి నేత పోట్లపూడి రాజేష్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద రోగులకు భోజన పథకం ను ఎమ్మెల్యే ప్రారంభించడం అభినందనీయమని కొనియాడారు.

## కార్యకర్తల కుటుంబాలకు ప్రమాదబీమా చెక్కులు అందచేసిన ప్రత్తిపాటి



చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 12: రోడ్డు ప్రమాదాల్లో మరణించిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి అండగా నిలిచారు. బుధవారం పార్టీ అధిష్టానం మంజూరు చేసిన రూ.5 లక్షల ప్రమాదబీమా నగదు చెక్కులను మృతుల భార్యలకు అందజేశారు. ప్రమాదంలో మరణించిన చిలకలూరిపేట మండలం కావూరి గ్రామానికి చెందిన పెదవల్లి నాగేశ్వరరావు, యడ్లపాడు గ్రామానికి చెందిన పాలపర్తి రాంబాబు కుటుంబ సభ్యులను ప్రత్తిపాటి పరామర్శించారు. పార్టీ పరంగా అన్ని విధాలా అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు. నాగేశ్వరరావు సతీమణి శైలజ, రాంబాబు సతీమణి కోటేశ్వరమ్మలకు ధైర్యం చెప్పి ప్రమాదబీమా నగదు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, టీడీపీ నాయకులు పోపూరి రాఘవయ్య, వెంకట రత్తయ్య, కోడె హనుమంతరావు, చంద్ర, మలెంపాటి రామారావు, మద్దాలి వెంకట ప్రసాద్, హరిప్రసాద్ తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి విజ్ఞప్తి

### టి.రవీంద్ర డిప్యూటీ డైరెక్టర్ ఆంధ్రప్రదేశ్ దివ్యాంగుల సంక్షేమ శాఖ



విజయవాడ, పెన్ పవర్,ఆగస్టు 12: ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న దివ్యాంగులకు అర్హత ఉన్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే కలేషా కోరారు.ఈ మేరకు జూలై 30న సమితి తరఫున సమర్పించిన వినతిపత్రాన్ని దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, సీనియర్ సిటిజన్ల సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి, ఐఏఎస్ స్వీకరించారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానంలో ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న దివ్యాంగులకు ప్రస్తుతం అర్హత ఉన్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందకపోవడంతో జీవనోపాధి, సంక్షేమ పరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. అర్హులైన దివ్యాంగ ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, సీనియర్ సిటిజన్ల శాఖ కార్యదర్శికి డైరెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి లేఖను పంపించారు. లేఖ ప్రతిని సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే కలేషాకు కూడా పంపించారు.

# పొదుపు నీటి వినియోగంతో.. చివరి ఆయకట్టు వరకు సాగునీరు

### నీటి పారుదల సలహా మండలి సమావేశంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

### కోవూరు రైతుల కోసం సెప్టెంబర్ 30 వరకు సాగునీరు అందించాలి

### లస్కర్లకు సకాలంలో జీతాలు చెల్లించాలి



**నెల్లూరు పెన్ పవర్ ఆగస్టు 12 :** కోవూరు నియోజకవర్గం డెల్టా ప్రాంతమని, ఇక్కడ ఎక్కువ మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, అందువల్ల చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. బుధవారం నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన నీటి పారుదల సలహా మండలి (ఐ ఏ బి) సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గత ఐ ఏ బి సమావేశంలో అందుబాటులో ఉన్న నీటి లభ్యత, తాగునీరు, ఇతర అవసరాలకు పోను ఎన్ని ఎకరాలకు సాగునీరు అందించగలమనే అంశంపై చర్చించి నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తూ ప్రతి ఎకరానికి నీరు అందించే విధానంపై ఈ సమావేశంలో చర్చించామని చెప్పారు. కోవూరు నియోజకవర్గ పరిధిలో రెండో పంటకు పూర్తి ఆయకట్టుకు నీరు అందించామని ఎమ్మెల్యే తెలిపారు. అధికారులు, నీటి సంఘాల అధ్యక్షులతో మాట్లాడిన సందర్భంగా గతంలో రెండో పంటకు ఈస్ట్రన్ ఛానల్ కింద 13వ మైలు వరకు మాత్రమే నీరు ఇచ్చేవారని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండో పంటకు పూర్తి స్థాయిలో విడవలూరు మండలం చివరి గ్రామమైన రామతీర్థం వరకు నీరు అందిస్తున్నట్లు వారు తెలియజేశారని చెప్పారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో ఎండలు ఎక్కువగా ఉండటంతో పాటు, కోవూరు నియోజకవర్గంలో కాలువ చివరి భూములు ఇసుక నేలలు కావడంతో సాగునీరు అందించడం సవాలుగా మారిందని తెలిపారు. అయినప్పటికీ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కలెక్టర్ హిమాన్షు శుక్లా ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ చివరి ఆయకట్టు వరకు నీరు అందించేలా చర్యలు తీసుకున్నారని అన్నారు. ఇందుకు మంత్రి కలెక్టర్ కోవూరు నియోజకవర్గ రైతాంగం తరఫున ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. కోవూరులో లక్ష ఎకరాల సాగుబడికి సంబంధించి సెప్టెంబర్ 17 వరకు బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు మండలాలకు, సెప్టెంబర్ 30 వరకు చివరి ఆయకట్టైన కొడవలూరు, విడవలూరు మండలాలకు సాగునీరు అవసరమని ఎమ్మెల్యే ఐ ఏ బి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. నీటిని పొదుపుగా వినియోగించడం వల్ల కనిగిరి రిజర్వాయర్‌కి కేటాయించిన 13 టీఎంసీలలో 9.5 టీఎంసీలు మాత్రమే వినియోగించుకుని, చివరి ఆయకట్టు వరకు నీరు అందించగలిగామని తెలిపారు. దీంతో రైతులు సంతోషంగా ఉన్నారని చెప్పారు. నెల్లూరు జిల్లాలో అక్టోబర్, నవంబర్ నెలల్లో అధిక వర్షపాతం ఉండే అవకాశం ఉందని సూచనలు ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది అనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుచూపుతో మే మొదటి వారంలోనే పంటకు నీరు అందించేలా చర్యలు తీసుకున్నారని అన్నారు. దీంతో సెప్టెంబర్ చివరికల్లా పంట చేతికి వచ్చే అవకాశం ఉందని, కోతల సమయంలో వర్షాల వల్ల ఇబ్బందులు ఉండవని రైతులు చెబుతుండటం సంతోషంగా ఉందని తెలిపారు.

**లస్కర్లకు సకాలంలో జీతాలు చెల్లించాలి :** ఇంతటి ఎండలు ఉన్నప్పటికీ రాత్రింబవళ్లు కష్టపడి, నీటిని పొదుపుగా వినియోగిస్తూ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడంలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న లస్కర్లను ఎమ్మెల్యే అభినందించారు. అయితే లస్కర్లకు సకాలంలో జీతాలు చెల్లించలేకపోతున్నామని, ఈ విషయాన్ని ఇప్పటికే పలుమార్లు ప్రస్తావించామని తెలిపారు. మంత్రి కలెక్టర్ ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టి లస్కర్లకు సకాలంలో జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఎల్‌నినో పరిస్థితుల్లో ప్రతి నీటిబొట్టు విలువైనదే

### రైతులు ఆరుతడి పంటలపై దృష్టి పెట్టాలి: ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



**నెల్లూరు, పెన్ పవర్ ఆగస్టు 12:** ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావం ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రతి నీటిబొట్టును పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని సూచించారు. రైతులు, నీటి సంఘాల ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే ఎడగారు సాగును ఇబ్బందులు లేకుండా పూర్తి చేయవచ్చన్నారు. నెల్లూరులోని కలెక్టరేట్ ప్రాంగణంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన, జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా ఆధ్వర్యంలో ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యేలు కావ్యా కృష్ణారెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కాకర్ల సురేష్‌తో పాటు నీటిపారుదల, వ్యవసాయ శాఖల అధికారులు, వివిధ శాఖల అధికారులు, నీటి సంఘాల ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. వ్యవసాయంపై ఎల్‌నినో ప్రభావం ఉంటుందని, ముందుగానే అప్రమత్తంగా ఉండాలని సాగునీటి సలహా మండలి సమావేశంలోనే తాను ప్రస్తావించానని సోమిరెడ్డి తెలిపారు. అందులో భాగంగానే రెండో పంట సాగు విస్తీర్ణాన్ని తగ్గించుకున్నామని చెప్పారు. జాఫర్‌సాహెబ్ కాలువ పరిధిలో 44,500 ఎకరాలకు గాను 40 వేల ఎకరాల్లో మాత్రమే సాగు చేపట్టినట్లు తెలిపారు. సర్వేపల్లి రిజర్వాయర్ పరిధిలో 15,350 ఎకరాలకు గాను 7,500 ఎకరాల్లో, కృష్ణపట్నం కాలువ పరిధిలో 10,800 ఎకరాలకు గాను 6,900 ఎకరాల్లో సాగు జరుగుతోందన్నారు. మొత్తంగా 91,500 ఎకరాలకు గాను 74,500 ఎకరాల్లో మాత్రమే ప్రస్తుతం సాగు జరుగుతోందని వివరించారు. కనుపూరు కాలువ కింద సుమారు 70 వేల ఎకరాల ఆయకట్టు ఉన్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని కేవలం 27 వేల ఎకరాలకే సాగును పరిమితం చేసినట్లు పేర్కొన్నారు. సాగు, తాగునీటి అవసరాలు, జలాశయంలోని కనీస నిల్వలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత సోమశిల జలాశయంలో సుమారు 3 టీఎంసీల నీరు మాత్రమే మిగిలే పరిస్థితి ఉందని తెలిపారు.

**కాలువల వారీగా అధికారులకు బాధ్యతలు :** రైతులు, నీటి సంఘాల ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగితే నీటి కొరత లేకుండా ఎడగారు సీజన్‌ను పూర్తి చేయవచ్చని సోమిరెడ్డి అన్నారు. గతంలో ప్రతి కాలువకు ఒక్కో అధికారిని బాధ్యుడిగా నియమించి విజయవంతంగా సాగునీటి నిర్వహణ చేసిన విధానాన్ని పరిశీలించాలని కలెక్టర్‌ను కోరారు. దివంగత జక్కా వెంకయ్య సూచనలతో గతంలో ఒక టీఎంసీ నీటితో 16 వేల ఎకరాల వరకు సాగు చేసిన సందర్భాలు ఉన్నాయని గుర్తుచేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆరుతడి పంటల ద్వారా కూడా మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉందని, రైతులు ఆ దిశగా ఆలోచించాలని సూచించారు. ధాన్యానికి ప్రస్తుతం మంచి ధరలు లభించడం శుభపరిణామమన్నారు. వచ్చే మొదటి పంట సీజన్‌కు వరుణుడు కరుణించి సోమశిల జలాశయం నిండాలని, లేకపోతే శ్రీశైలం నుంచి కృష్ణా జలాలు రావాలని ఆకాంక్షించారు. 2023 రెండో పంట సీజన్‌లో 1.10 లక్షల ఎకరాలకు 40 టీఎంసీల నీటిని వినియోగించడంతో అనంతరం గూడూరు డివిజన్, సోమశిల ఉత్తర, దక్షిణ కాలువలు, కావలి కాలువల పరిధిలో మొదటి పంటకు 3.50 లక్షల ఎకరాలు బీడు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఒక్క టీఎంసీ నీటిని కూడా పొదుపు చేయగలిగితే లక్షలాది ప్రజల ప్రయోజనాలను కాపాడినట్టేనని సోమిరెడ్డి పేర్కొన్నారు. నీటిని వృథా కాకుండా సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పెన్నా పరివాహక ప్రాంతంలో సమృద్ధిగా వర్షాలు కురిసి సోమశిల జలాశయం నిండాలని, శ్రీశైలం నుంచి కృష్ణా జలాలు కూడా రావాలని కోరుకుందామని అన్నారు.

**నిలిచిపోయిన కాలువ పనులు పూర్తి చేయాలి :** దేగపూడి–బండేపల్లి కాలువ పనులు 35 శాతం వరకు పూర్తయి నిలిచిపోయాయని సోమిరెడ్డి తెలిపారు. ఈ కాలువ పూర్తయితే సుమారు 20 వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. పొదలకూరులో 13ఆర్ కాలువ పనులు కూడా నిలిచిపోయాయని చెప్పారు. నిలిచిపోయిన ఈ కాలువ పనులను త్వరితగతిన పూర్తి చేసే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని, జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లాను కోరుతున్నట్లు సోమిరెడ్డి తెలిపారు.

# హెడ్ కానిస్టేబుల్‌పై కత్తితో దాడికి యత్నం

### ఇద్దరు యువకుల అరెస్ట్





**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ఆగస్టు 12:** విధుల్లో ఉన్న పోలీసు హెడ్ కానిస్టేబుల్‌పై దాడి చేయడంతో పాటు కత్తితో పొడిచేందుకు యత్నించిన ఇద్దరు యువకులను శ్రీకాళహస్తి ఒకటో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు అచ్చి శ్రీనివాసులు వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు సముద్రాల జితేంద్ర కుమార్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. మంగళవారం సాయంత్రం శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్‌లో ల్యాప్‌టాప్ చోరీకి గురైనట్లు అత్యవసర సేవల నంబరు 112కు సమాచారం అందింది. సమాచారం అందుకున్న శ్రీకాళహస్తి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ ఉ. రమణయ్య మోటారు సైకిల్‌పై రైల్వే స్టేషన్‌కు వెళ్తుండగా, ప్రధాన రహదారిపై హ్యాపీ కిచెన్ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ప్రమాదానికి గురై, సంబంధిత వ్యక్తులు గొడవపడుతుండటాన్ని గమనించారు. ప్రమాదంలో గాయపడిన బుజ్జమ్మ అనే మహిళను ఆమె భర్త సహాయంతో ఆటోలో ఆసుపత్రికి పంపించిన హెడ్ కానిస్టేబుల్.. రోడ్డుకు అడ్డంగా ఉన్న స్కూటీని పక్కకు పెట్టించి, దాని తాళాలను తీసుకున్నారు. వాహనం నడిపిన వ్యక్తిని పోలీస్‌స్టేషన్‌కు రావాలని సూచించారు. ఈ సమయంలో స్కూటీపై వెనుక కూర్చున్న వ్యక్తి హెడ్ కానిస్టేబుల్‌తో దురుసుగా ప్రవర్తించి, ఆయన యూనిఫాం చొక్కాను పట్టుకుని లాగుతూ దాడికి పాల్పడ్డాడు. అదే సమయంలో అచ్చి శ్రీనివాసులు తన వద్ద ఉన్న కత్తిని బయటకు తీసి హెడ్ కానిస్టేబుల్‌పై దాడి చేసి పొడిచేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. అయితే హెడ్ కానిస్టేబుల్ తృటిలో తప్పించుకోవడంతో ప్రమాదం తప్పింది. ఘటనపై హెడ్ కానిస్టేబుల్ ఇచ్చిన ప్రత్యేక నివేదిక ఆధారంగా శ్రీకాళహస్తి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నేర సంఖ్య 112/2026 కింద భారతీయ న్యాయ సంహితలోని 132, 109(1), 351(2)తో పాటు 3(5) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**ఎస్పీ ఆదేశాలతో ప్రత్యేక బృందాలు :** ఈ కేసును తిరుపతి జిల్లా పోలీసు అధికారి ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్. సీరియస్‌గా తీసుకుని, శ్రీకాళహస్తి డీఎస్పీ కె. నరసింహమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. శ్రీకాళహస్తి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సి. వెంకటేష్, ఉప పరిశీలకుడు ఎం. రామకృష్ణ, సిబ్బంది కలిసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా ప్రధాన నిందితుడు అచ్చి శ్రీనివాసులను మంగళవారం రాత్రి అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. రెండో నిందితుడు సముద్రాల జితేంద్ర కుమార్‌ను బుధవారం అరెస్ట్ చేశారు. అచ్చి శ్రీనివాసులు (22) శ్రీకాళహస్తి పట్టణంలోని కొత్తపేటకు చెందిన వ్యక్తిగా, ప్రస్తుతం కొండమిట్టలో నివాసం ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. అతనిపై శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గతంలో ఒక కేసు ఉన్నట్లు పేర్కొన్నారు. రెండో నిందితుడు సముద్రాల జితేంద్ర కుమార్ (20) బీటెక్ మూడో సంవత్సరం విద్యార్థిగా పోలీసులు తెలిపారు. విధుల్లో ఉన్న పోలీసులపై దాడి చేయడం, ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణిస్తామని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు.

# డీపీ చాక్లెట్స్ పరిశ్రమలో కార్మికుడి దుర్మరణం

### భద్రతా ప్రమాణాలపై ప్రశ్నలు.. రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్




**తిరుపతి , పెన్ పవర్ ఆగస్టు 12:** తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలంలోని డీపీ చాక్లెట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో బుచ్చినాయుడుకండ్రిగ మండలానికి చెందిన 33 ఏళ్ల కార్మికుడు కనపర్తి సునీల్ మృతి చెందాడు. ఈ ఘటనతో కార్మికుల భద్రతపై పరిశ్రమ యాజమాన్యం, సంబంధిత భద్రతా అధికారుల బాధ్యతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**ప్రమాదంపై ఆగ్రహం :** పరిశ్రమలో అవసరమైన భద్రతా చర్యలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని కార్మికులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో కనిపించిన పరిస్థితులు భద్రతా ప్రమాణాల అమలుపై అనుమానాలు కలిగిస్తున్నాయని వారు పేర్కొన్నారు. ప్రమాదానికి అసలు కారణాలు, భద్రతా నిబంధనలు అమలయ్యాయా లేదా అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. కార్మికుల భద్రత విషయంలో నిర్లక్ష్యం జరిగి ఉంటే బాధ్యులైన యాజమాన్య ప్రతినిధులు, సంబంధిత అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**కుటుంబానికి సునీల్ మరణం తీరని లోటు :** మృతుడు కనపర్తి సునీల్ కుటుంబానికి ప్రధాన ఆధారంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ఆయన మృతితో భార్యతో పాటు ముగ్గురు చిన్నారులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మృతుడి పిల్లలు నిక్షిత (6), యశ్వంత్ సాయి (4), యశస్వి (4) ఉన్నారు. కుటుంబానికి జీవనాధారంగా ఉన్న సునీల్‌ను కోల్పోవడంతో ఆ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో పడే పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

***రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియాకు డిమాండ్ :*** మృతుడి కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, పరిశ్రమ యాజమాన్యం తక్షణమే స్పందించి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని స్థానికులు డిమాండ్ చేశారు. అంతేకాకుండా కుటుంబంలోని ఒకరికి ఉపాధి కల్పించాలని, పిల్లల విద్యకు అవసరమైన సహాయం అందించాలని కోరుతున్నారు. ప్రమాదానికి దారితీసిన కారణాలను అధికారులు సమగ్రంగా విచారించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పరిశ్రమలో భద్రతా ప్రమాణాలను కఠినంగా అమలు చేయాలని కార్మిక సంఘాలు, స్థానికులు కోరుతున్నారు.

# ఏటీఎం కార్డు మార్చి నగదు అపహరణ

నాగలాపురం : స్థానిక ఎస్‌బీఐ ఏటీఎంలో ఓ వ్యక్తి డెబిట్ కార్డు మార్చి రూ.27 వేలు కాజేసిన ఘటన బుధవారం ఉదయ జరిగింది. బాధితుడి కథనం మేరకు.. పిచ్చాటూరుకు చెందిన అరుళ్‌మొయి నాగలాపురం స్టేట్ బ్యాంక్ ఏటీఎంలో నగదు డ్రా చేసేందుకు వెళ్లాడు. అదే సమయంలో వెనుక ఉన్న గుర్తు తెలియని వ్యక్తి తొందర పెడుతున్నట్లు నటించి ఏటీఎం కార్డును మార్చేశాడు. ఈ విషయం గమనించకుండా ఇంటికి వెళ్లిన అరుళ్‌కు తన బ్యాంకు ఖాతా నుంచి వరుసగా రూ.10వేలు రెండు సార్లు, రూ.7 వేలు ఒకసారి మొత్తం రూ.27 వేల నగదు డెబిట్ అయినట్లు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో ఏటీఎం కార్డును పరిశీలించగా కార్డు మారిన విషయం గుర్తించి వెంటనే నాగలాపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఏనుగులకు ఘన సత్కారం

తిరుపతి రూరల్: ప్రపంచ ఏనుగుల దినోత్సవం సందర్భంగా తిరుపతి ఎస్వీ గోశాలలో బుధవారం లక్ష్మి, వైష్ణవి, పద్మావతి అనే మూడు ఆడ ఏనుగులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఏనుగులు ఏళ్లుగా స్వామివారి సేవలో భాగస్వాములవుతున్నాయి. వీటిని కేవలం జంతువులుగా కాకుండా ఆలయ సంప్రదాయాల్లో భాగస్వాములుగా భావిస్తూ టీటీడీ ప్రత్యేక శ్రద్ధతో సంరక్షిస్తోంది. ఏనుగుల ఆరోగ్యం, పోషణ, సంక్షేమంపై నిరంతరం పర్యవేక్షణ చేపడుతోంది. గోశాల డైరెక్టర్ ఏవీఎన్ శివకుమార్ పాల్గొన్నారు.

# ఫిన్లాండ్‌కు బాలసుబ్రమణ్యం

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): తొట్టంబేడు మండలంలోని దిగువ సాంబయ్య పాళెం ఫౌండేషన్ స్కూల్ ఉపాధ్యాయుడు బాలసుబ్రమణ్యం ఫిన్లాండ్‌లో చేపట్టే శిక్షణకు ఎంపికయ్యారు. బుధవారం ఈ మేరకు ప్రభుత్వం ఉత్వర్తులు జారీ చేసింది. ప్రాథమిక స్థాయిలో అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం, అభ్యాస నైపుణ్యాలను బలోపేతం చేయడానికి ఈ నెల 17 నుంచి 26వ తేదీ వరకు ఫిన్లాండ్‌లోని తుర్కు యూనివర్సిటీలో శిక్షణ తరగతులు చేపట్టనున్నారు. దేశవ్యాప్తంగా మొత్తం 29 మంది ఉత్తమ ఉపాధ్యాయులు ఈ శిక్షణకు హాజరవుతున్నారు. ఈ క్రమంలో బాలసుబ్రమణం 15వ తేదీన ఫిన్లాండ్‌కు బయలుదేరి వెళ్లనున్నారు..

# ఇంటెలిజన్స్ వైఫల్యమేనా అధికార పార్టీలో అనుమానాలు

**కర్నూలు, ఆగస్టు 12, పెన్ పవర్:** కర్నూలులో శాంతి భద్రతల సమస్యలపై మంత్రి టీజీ భరత్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సంచలనంగా మారాయి. ఒకవైపు హోం మంత్రి అనిత లా అండ్ ఆర్డర్ బాగుందంటూ చెబుతూ ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సయితం రౌడీషీటర్లను పీచమణిచేస్తానని ప్రతి సభలో హుంకరిస్తున్నారు. కానీ చంద్రబాబు మంత్రివర్గంలో సభ్యుడిగా ఉన్న టీజీ భరత్ మాత్రం కర్నూలులో ఇంటలిజెన్స్ తో పాటు అధికార వ్యవస్థ కూడా పూర్తిగా విఫలమయిందని ఆరోపణలు చేయడం సూటిగా కూటమి ప్రభుత్వానికి తాకినట్లయింది. మంత్రి టీజీ భరత్ ఈ వ్యాఖ్యలు ఆయన ఆవేదనలో భాగమయి ఉండవచ్చు. కానీ అది ప్రభుత్వ పనితీరును ప్రశ్నించే విధంగా ఉన్నాయంటూ పెద్దయెత్తున ప్రత్యర్థులు దానిని తమకు అనుకూలంగా మలచుకుంటున్నారు... కర్నూలులో టీడీపీ కార్యకర్త ఇంతియాజ్ హత్య ఘటనపై పోలీసుల నిఘా వైఫల్యమంటూ ఏపీ మంత్రి టీజీ భరత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హత్యకు ముందే సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా పోలీసులు, ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఎందుకు స్పందించలేదని నిలదీశారు.ద

మంత్రుల కదలికలపై నిఘా పెట్టే అధికారులు నేరస్థులపై ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు.పోలీసుల తీరుపై మంత్రి టీజీ భరత్ అసంతృప్తి కర్నూలులో శాంతిభద్రతల పరిరక్షణలో మరియు నిఘా వ్యవస్థ పనితీరులో స్పష్టమైన వైఫల్యం కనిపిస్తోందని మండిపడ్డారు.హత్యకు ముందే బాధితుడి ఫొటో పెట్టి సోషల్ మీడియాలో '=ఖ్రా' అని పోస్ట్ చేసినా పోలీసులు గుర్తించలేకపోవడంపై అసంతృప్తి వెళ్లి బుచ్చారు.మంత్రులు ఎక్కడికి వెళ్తున్నారు, ఎవరిని కలుస్తున్నారనే విషయాలపై ఉండే శ్రద్ధ.. నేరస్థుల కదలికలపై ఎందుకు ఉండడం లేదని ప్రశ్నించారు.ఈ ఘటనపై సీఎంను కలిసి ఫిర్యాదు చేస్తానని, రౌడీ మూకల అరాచకాలపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని హెచ్చరించారు. కర్నూలులో రౌడీలు రెచ్చిపోతున్నారని మంత్రి భరత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. హత్యలకు తెగబడుతున్నారని మంత్రి భరత్ఇంతియాజ్ హత్య అంటూ వారం క్రితమే సోషల్ మీడియాలో వచ్చిందని, మంత్రులు,

ఎమ్మెల్యేలు,ద

నేతలపై వాళ్లు నిఘా పెడుతుంటే..పోలీసులు ఏం చేస్తున్నారంటూ మంత్రి భరత్ ప్రశ్నించడం కూటమి ప్రభుత్వంలోని శాంతి భద్రల సమస్యను ఎత్తి చూపుతుందని విపక్ష వైసీపీ నేతలు అంటున్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా విఫలమయిందని, అందుకు తాము కాదని, మంత్రి భరత్ వ్యాఖ్యలే ఉదాహరణ అని చెబుతున్నారు. తన పార్టీ నేత హత్యతో ఆవేదనకు గురైనా మంత్రి టీజీ భరత్ ఆవేదనతో చేసిన వ్యాఖ్యలుగా చూడాలని కూటమిలోని నేతలు సర్దిచెప్పుకుంటున్నా.. అది ప్రభుత్వాన్ని మాత్రం డ్యామేజీ చేసే విధంగా ఉందన్న వ్యాఖ్యలు మాత్రం వినిపిస్తున్నాయి. దీనిపై టీజీ భరత్ ను పార్టీ నాయకత్వం వివరణ కోరే అవకాశాలు లేకపోలేదు.


03

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


## బలవంతపు నిరసనలతో బలం పెరిగేనా

**నెల్లూరు, ఆగస్టు 12, పెన్ పవర్:** వైఎస్ జగన్ వ్యూహం తప్పుతున్నట్లు కనిపిస్తుంది. ఆయన మెగా డీఎస్సీలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు చేయడమే కాకుండా దీనికి ఎండ్ కార్డు మాత్రం పడే అవకాశం లేదు. టీడీపీ ప్రస్తుతం కూటమిలో ఉంది. కేంద్ర ప్రభుత్వానికి చంద్రబాబు అవసరం ఎంతో ఉంది. కేంద్రం నుంచి కూడా స్పందన వచ్చే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో ఈ పోరు కు అంతం లేదు. కాకుంటే ఆంధ్రప్రదేశ్ లో నిరుద్యోగ యువత నుంచి కొంత మద్దతు దొరుకుతుందేమోనని వైసీపీ భావించి మెగా డీఎస్సీలో అవకతవకలంటూ ఆందోళనలు, నిరసనలు కంటిన్యూ చేస్తుంది. ఈ ఆందోళనల్లో పాల్గొంటున్న వైసీపీ నేతలకే దీని వల్ల రాజకీయ ప్రయోజనం ఎంత వరకూ వస్తుందన్నది కూడా అంతు చిక్కకుండా ఉంది. కానీ పార్టీ అధినాయకత్వం ఆదేశాల మేరకు ఆందోళనలు చేయాల్సి వస్తుందని అంటున్నారు. వైసీపీ చేపట్టిన ఆందోళనల వల్ల ప్రయోజనం ఎంత మేరకు ఉంది? బలవంతపు నిరసనలుగానే కనిపిస్తుంది. ఈ ఆందోళనల్లో యువత పెద్దగా పాల్గొనకపోవడం కూడా చర్చనీయాంశమైంది. టీడీపీ దీనిని హైలెట్ చేస్తుంది. మెగా డీఎస్సీ రాసిన వారు ఎవరూ ఈ ఆందోళనల్లో పాల్గొనకపోవడంతోనే వైసీపీ ఆందోళనలు, నిరసనలు వృథా ప్రయాస అని అంటున్నారు. కానీ ఒకసారి బరిలోకి దిగి వెనక్కు తగ్గకూడదన్న ఏకైక కారణంతోనే వైసీపీ నేతలు ఆందోళనలు కొనసాగిస్తున్నారన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. వైసీపీ ఏ అంశంలోనైనా దానిని తుది వరకూ తీసుకెళ్లగలమన్న నమ్మకం ఉంటేనే కొనసాగించాలని, లేకుంటే కొన్ని రోజులు ఆందోళనలు చేసి వదిలేస్తే మంచిదన్న సూచనలు కూడా వెలువడుతున్నాయి. కానీ జగన్ మాత్రం మెగా డీఎస్సీపై ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేయాల్సిందేనన్న ఆదేశాలు ఇవ్వడంతో నేతలు విధిలేని పరిస్థితుల్లో చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మెగా డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేపట్టిన పోరాటం వల్ల రాజకీయంగా ఆ పార్టీకి పెద్దగా లాభం చేకూరకపోగా, న్యాయస్థానంలో ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఎంపికైన అభ్యర్థులు, ప్రభుత్వం నుంచి వ్యతిరేకత ఎదురవుతోంది.న్యాయస్థానంలో ఎదురుదెబ్బలుమెగా డీఎస్సీ అక్రమాలపై వైసీపీ దాఖలు చేసిన పిల్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది.రాజకీయ ప్రయోజనాల కోసం పిల్స్‌ను వాడరాదని కోర్టు స్పష్టం చేసింది. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు వైసీపీ తీరుపై రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారు.ఇది కేవలం డైవర్షన్ రాజకీయాలంటూ అధికార కూటమి పార్టీ నేతలు ఎదురుదాడి చేస్తున్నారు.మెగా డీఎస్సీ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని ప్రభుత్వం, అభ్యర్థులు చెబుతుండటంతో, ఈ అంశంపై వైసీపీ పోరు జనంలోకి బలంగా వెళ్లడం లేదనే విశ్లేషణలు వస్తున్నాయి. మొత్తం మీద ఈ పోరాటం నిష్ప్రయోజనమేనని అంటున్నారు.

## నో వర్క్ - నో పే .. జీతభత్యాల కోత పెడతారా?

**విజయవాడ, ఆగస్టు 12, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. వైసీపీ ఎమ్మెల్యేలు డీఎస్సీపై అసెంబ్లీ ముట్టడిని ప్రకటిస్తామని అంటున్నారు. నిజానికి అసెంబ్లీకి గత రెండేళ్లుగా వైఎస్సార్సీపీ నేతలు క్రమం తప్పకుండా దూరంగా ఉండటం, ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే సభకు రాబోమని తెగేసి చెప్పారు. వైఎస్సార్సీపీకి శాసనసభలో 11 మంది ఎమ్మెల్యేలు ఉండగా, జగన్ మినహా అందరూ హాజరుకాకుండానే ప్రజాధనం నుంచి జీతభత్యాలు పొందుతున్నారు. అందుకే నో వర్క్ – నో పే అనే విధానం గురించి స్పీకర్, డిప్యూటీ స్పీకర్ చాలా సార్లు చర్చించారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 190(4) ప్రకారం.. ఒక శాసనసభ సభ్యుడు సభ ముందస్తు అనుమతి లేకుండా వరుసగా 60 రోజుల పాటు అన్ని సమావేశాలకు గైర్హాజరైతే, ఆ స్థానాన్ని ఖాళీగా ప్రకటన చేసే అధికారం అసెంబ్లీకి ఉంటుంది. అయితే ఇక్కడ ఒక సాంకేతిక అంశం ఉంది. ఈ 60 రోజుల సమయాన్ని లెక్కించేటప్పుడు, సభ వాయిదా పడిన సమయాన్ని లేదా వరుసగా 4 రోజుల కంటే ఎక్కువ రోజులు సభ లేని కాలాన్ని మినహాయిస్తారు. సాధారణంగా అసెంబ్లీ సమావేశాలు ఏడాదికి 15 నుండి 20 రోజులకు మించి జరగవు. కాబట్టి కేవలం సమావేశాలకు రాలేదనే కారణంతో రాజ్యాంగబద్ధంగా 60 రోజుల గైర్హాజరును నిరూపించి అనర్హత వేటు వేయడం కొంత సమయంతో కూడుకున్న ప్రక్రియకేవలం రాజ్యాంగంలోని 60 రోజుల నిబంధనే కాకుండా, ఏపీ శాసనసభ నిర్వహణ నిబంధనల ప్రకారం స్పీకర్‌కు విస్తృతమైన అధికారాలు ఉంటాయి. సభను , రాజ్యాంగ వ్యవస్థను అవమానించేలా "మేము అసెంబ్లీకి రాము" అని బహిరంగంగా ప్రెస్ మీట్లు పెట్టి రికార్డెడ్ వ్యాఖ్యలు చేయడం, ప్రజాప్రతినిధిగా ప్రమాణం చేసి కూడా సభ పట్ల బాధ్యతారాహిత్యంగా ఉండటాన్ని సభా హక్కుల ఉల్లంఘన కింద పరిగణించే అవకాశం ఉంది. ప్రివిలేజ్ కమిటీ ద్వారా విచారణ జరిపి, నోటీసులు ఇచ్చి, నిర్ణీత గడువులోగా హాజరు కాకపోతే సభ్యత్వాన్ని రద్దు చేసే దిశగా స్పీకర్ ముందడుగు వేయవచ్చు.అనర్హత వేటు కంటే ముందు ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న ప్రధాన ఆయుధం నో వర్క్ – నో పే. సభకు హాజరు కాకుండా ప్రజాధనం నుంచి జీతాలు, భత్యాలు తీసుకోవడం నైతికంగా తప్పని ఇప్పటికే స్పీకర్ కార్యాలయం భావిస్తోంది. ఒకవేళ సభ్యులు సభకు రాకపోతే వారి అలవెన్సులు, పెన్షన్ లేదా జీతాలను నిలిపివేస్తూ స్పీకర్ ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది. ఇది పొలిటికల్ , లీగల్ చెక్–మేట్ అవుతుంది. జీతాలు ఆపేస్తే.. వైఎస్సార్సీపీ ఎమ్మెల్యేలు కోర్టును ఆశ్రయించక తప్పదు, అప్పుడు సభకు ఎందుకు వెళ్లడం లేదో కోర్టుకు సమాధానం చెప్పుకోవాల్సి వస్తుంది.వైసీపీ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందా లేదా అనేది పెద్ద ప్రశ్న. ఒకవేళ జగన్ సహా 11 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటిస్తే, ఆయా నియోజకవర్గాల్లో 6 నెలల లోపు ఉపఎన్నికలు నిర్వహించాల్సి వస్తుంది. తమను అణచివేస్తున్నారని, కక్షసాధింపు చర్యలతోనే సభ్యత్వాలు రద్దు చేశారని వైసీపీ సానుభూతి పొందే ప్రమాదం ఉందనే అభిప్రాయం కూడా ఉంది. అయితే, ప్రతిపక్షంలో ఉన్న నాయకులు ఉపఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం చేయలేరు కాబట్టి, వారిపై అనర్హత వేటు వేస్తే ఉపఎన్నికల్లో వారిని గెలిపించుకోవడానికి వైసీపీ ముప్పుతిప్పలు పడుతుందని, దాంతో వైసీపీ క్యాడర్ పూర్తిగా కుప్పకూలుతుందని మరో వ్యూహాత్మక వర్గం వాదిస్తోంది. ప్రజా సమస్యలను అసెంబ్లీ వేదికగా గొంతు విప్పి అడగాల్సిన ఎమ్మెల్యేలు.. కేవలం హోదా దక్కలేదనే నెపంతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని జీతాల రూపంలో దండుకోవడం ఎంతవరకు సమంజసమని సోషల్ మీడియాలో అభిప్రాయం వినిపిస్తోంది. సభకు రాని పక్షంలో రాజీనామా చేసి బయటకు రావాలని, లేదా ప్రభుత్వం వెంటనే వారి సభ్యత్వాలను రద్దు చేయాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. శాసనసభ నిబంధనలను, రాజ్యాంగ సూత్రాలను పరిశీలిస్తే.. వైసీపీ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడానికి స్పీకర్‌కు స్పష్టమైన మార్గాలు ఉన్నాయి. కాకపోతే అది కేవలం చట్టపరమైన నిర్ణయం మాత్రమే కాదు, రాజకీయ పరిణామాలకు దారితీసే అంశం. ప్రభుత్వం ముందస్తుగా నో వర్క్ – నో పే విధించి, ఆ తర్వాత నోటీసులు ఇచ్చి నిలదీసే వ్యూహంతో ముందుకు వెళ్లే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

**వైసీపీ వ్యూహం ఏమిటీ...**

అసెంబ్లీ సమావేశాలకు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హాజరవుతారా అనే అంశం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. 2024లో ప్రభుత్వం మారిన తర్వాత జరిగిన అనేక అసెంబ్లీ సమావేశాలకు జగన్ దూరంగా ఉన్నారు. దీంతో ఆయన సభకు ఎందుకు రావడం లేదన్న ప్రశ్న పదేపదే తెరపైకి వచ్చింది.ప్రజా సమస్యలపై చర్చించడానికి శాసనసభ కీలక వేదిక కావడంతో ప్రతిపక్ష నాయకుడు సభలో ఉండాలని అధికార, ప్రతిపక్ష వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. గతంలో ప్రతిపక్ష హోదా కల్పిస్తేనే అసెంబ్లీకి వస్తానని జగన్ చెప్పిన విషయం కూడా రాజకీయ చర్చకు కారణమైంది. ఈ అంశంపై ఆయన న్యాయపరమైన మార్గాలను కూడా ఆశ్రయించినప్పటికీ అనుకున్న ఫలితం రాలేదని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.ఇటీవల వైసీపీ మెగా డీఎస్సీ అంశాన్ని ప్రధానంగా తీసుకుని ప్రభుత్వంపై విమర్శలు చేస్తోంది. డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ మంత్రి నారా లోకేష్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని వైసీపీ డిమాండ్ చేస్తోంది. విద్యార్థులు, నిరుద్యోగులకు సంబంధించిన ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించేందుకు వైసీపీ సిద్ధమవుతున్నట్లు సమాచారం. అయితే ఇదే అంశంపై సభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడీవేడీ చర్చ జరిగే అవకాశం కూడా ఉంది.మరోవైపు జగన్ అసెంబ్లీకి గైర్హాజరయ్యే విషయంలో సభ్యుల హాజరుకు సంబంధించిన నిబంధనలు కూడా చర్చలోకి వస్తున్నాయి. ఒక ఎమ్మెల్యే వరుసగా 60 రోజుల పాటు సభకు హాజరు కాకపోతే నిబంధనల ప్రకారం సభ్యత్వంపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో రాబోయే సమావేశాలకు జగన్ హాజరయ్యే అవకాశం ఉందన్న ప్రచారం కూడా జరుగుతోంది. 2025 ఫిబ్రవరి 24న జగన్ సభకు హాజరైనట్లు, అనంతరం 2026 ఫిబ్రవరి 11న గవర్నర్ ప్రసంగం సందర్భంగా అసెంబ్లీకి వచ్చి కొద్దిసేపటికే బయటకు వెళ్లినట్లు రాజకీయ వర్గాలు గుర్తుచేస్తున్నాయి. ఇప్పుడు ఆగస్టు 17 నుంచి ప్రారంభమయ్యే సమావేశాల్లో ఆయన వ్యవహరించే తీరు ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది.జగన్ మరోసారి అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోతే, ప్రజా సమస్యలపై చర్చించే ప్రధాన వేదికకు ఆయన దూరంగా ఉంటున్నారనే భావన ప్రజల్లో బలపడే అవకాశం ఉంది. ఇది ప్రజా తీర్పును గౌరవించడం లేదన్న అభిప్రాయానికి దారితీసి, ప్రజల్లో ఆయనపై ఉన్న విశ్వాసంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశముంది.

# అసెంబ్లీ సమావేశాలకు వైసీపీ అజెండా ఇదే.. ఫిక్స్ అయిన జగన్



**హైదరాబాద్ పెన్ పవర్:** అసెంబ్లీ వర్షాకాల సమావేశాలపై విపక్షం వైసీపీ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 17 నుంచి శాసనసభ, శాసనమండలి వర్షాకాల సమావేశాలు మొదలు కానున్నాయి. ఒకవైపు ప్రభుత్వం ఈ ఏర్పాట్లు చేస్తుండగా, సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బుధవారం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అదేసమయంలో శాసనసభతోపాటు మండలిలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. అయితే ప్రధాన ప్రతిపక్ష హోదా ఇస్తేనే శాసనసభకు వెళ్లాలని నిర్ణయించారు. అదేసమయంలో శాసనమండలిలో ప్రభుత్వాన్ని నిలదీసేలా పలు అస్త్రాలను సిద్ధం చేయాలని చర్చించారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అక్రమాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని వైసీపీ నిర్ణయించింది. శాసనమండలి సమావేశాల్లో ఇదే ప్రధాన అజెండాగా చర్చకు పట్టుబడాలని ఆ పార్టీ నిర్ణయించిందని చెబుతున్నారు. అంతేకాకుండా మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని ఒత్తిడి చేయాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మాజీ సీఎం జగన్ రెడ్డి దిశానిర్దేశం చేసినట్లు చెబుతున్నారు. శాసనమండలికి యథావిధిగా హాజరుకావడంతోపాటు అసెంబ్లీ బయట రకరకాల కార్యక్రమాలతో డీఎస్సీ అక్రమాలపై ప్రభుత్వాన్ని ఒత్తిడికి గురిచేయాలని నిర్ణయించుకున్నట్లు చెబుతున్నారు.

ఇక అసెంబ్లీ ప్రారంభానికి ఐదు రోజులు ముందుగానే విపక్షం అజెండా ఫిక్స్ చేయడం రాజకీయంగా హాట్ టాపిక్ అవుతోంది. ఇప్పటికే డీఎస్సీ స్పోర్ట్సు కోటాలో అక్రమాలపై వైసీపీ అనేక రకాలుగా ఆందోళనలు చేస్తోంది. రిలే నిరాహారదీక్షలతోపాటు భారీ ఎత్తున ర్యాలీలు నిర్వహించింది. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని భావిస్తున్న ప్రతిపక్ష సభ్యులు ఈ విషయంపై శాసనమండలిలో తాడోపేడో తేల్చుకుంటామని తేల్చిచెప్పడంతో వర్షాకాల సమావేశాలకు ముందే రాజకీయం కాకపుట్టిస్తోందని చెబుతున్నారు.

విపక్షం అజెండా ఎలా ఉండబోతుందో తేలిపోవడంతో ఇక ప్రభుత్వం ఎలా ఎదుర్కొంటుందనేది ఉత్కంఠ రేపుతోంది. అసెంబ్లీకి రామని చెబుతున్న వైసీపీ తమ ఆరోపణలు మాత్రం ఆపమని తేల్చిచెబుతోంది. దీంతో విపక్షానికి సమాధానం చెప్పడానికి ప్రభుత్వం ఏ మార్గం ఎంచుకుంటుందనేది ఆసక్తి రేపుతోంది. శాసనమండలిలో ఇప్పటికీ విపక్షానికే బలం ఎక్కువగా ఉండటం వల్ల ప్రభుత్వ వాదనను సమర్థంగా తీసుకువెళ్లే అవకాశాలపై అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీలో ద

బలం ఉన్నప్పటికీ వైసీపీ సభ్యులు హాజరుకాకపోవడం వల్ల చర్చలు ఏకపక్షంగా సాగిపోనున్నాయని అంటున్నారు. దీంతో ప్రభుత్వ వాదన ప్రజల్లోకి వెళుతుందా? అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనప్పటికీ అసెంబ్లీ అజెండాపై వైసీపీ ముందుగానే స్పష్టత ఇవ్వడంతో ఈ సారి వర్షాకాల సమావేశాలు వాడివేడిగా కొనసాగే పరిస్థితులు ఏర్పడ్డాయని అంటున్నారు.

# కోవర్ట్ రాజకీయాలు - టీడీపీ వర్గాల అనుమానాలు

**ఒంగోలు, ఆగస్టు 12 పెన్ పవర్:** ప్రకాశం జిల్లా ముఖ్యంగా ఒంగోలు నియోజకవర్గంలో మాజీ మంత్రి, జనసేన నేత బాలినేని శ్రీనివాసరెడ్డి , స్థానిక టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ల మధ్య తలెత్తిన రాజకీయ వైరం తీవ్ర రూపం దాల్చుతోంది. వైఎస్సార్సీపీని వీడి జనసేనలో చేరినప్పటి నుంచి బాలినేని శ్రీనివాసరెడ్డి స్థానిక ఎమ్మెల్యే దామచర్లను లక్ష్యంగా చేసుకుని ఆరోపణలు గుప్పించడం, దానికి ప్రతిగా దామచర్ల కూడా సవాళ్లు విసరడంతో ఒంగోలు రాజకీయాలు కూటమి వర్సెస్ కూటమి అనే స్థాయికి చేరాయి. ఒంగోలు నియోజకవర్గంలో బాలినేని శ్రీనివాసరెడ్డి, దామచర్ల కుటుంబాల మధ్య రాజకీయ వైరం దశాబ్దాలుగా కొనసాగుతోంది. గతంలో ఇరు నాయకులు ప్రత్యర్థి పార్టీల నుంచి పోటీపడేవారు. అయితే బాలినేని జనసేన పార్టీలో చేరినప్పటికీ, పాత విభేదాలు మాత్రం వీడలేదు. ఒంగోలుపై తన పట్టు నిలుపుకోవాలని బాలినేని ప్రయత్నిస్తుంటే, సిట్టింగ్ ఎమ్మెల్యేగా పూర్తి ఆధిపత్యం చెలాయించాలని దామచర్ల భావిస్తున్నారు. ఇద్దరి లక్ష్యం ఒంగోలు రాజకీయాన్ని శాసించడమే కావడంతో ఈ ఘర్షణ వ్యక్తిగత స్థాయికి చేరింది. తాజాగా బాలినేని తన అనుచరులను కాపాడుకునేందుకు నేరుగా రంగానికి దిగారు. స్థానిక పోలీసులు ఎమ్మెల్యే దామచర్ల ఒత్తిళ్లతో తన వర్గానికి చెందిన వారిపై, జనసేన కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆయన బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ఇసుక, మద్యం, రేషన్ బియ్యం మాఫియాల వెనుక ఎమ్మెల్యే హస్తం ఉందంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. దానికి కౌంటర్‌గా.. వైఎస్సార్సీపీ హయాంలో జరిగిన అక్రమాల నుంచి తప్పించుకోవడానికే బాలినేని జనసేన ముసుగు వేసుకున్నారని, ఒంగోలులో రౌడీయిజం చెల్లదని దామచర్ల విమర్శలు గుప్పించడంతో పరిస్థితి తీవ్రమైంది.జనసేనలో చేరినప్పటికీ బాలినేని వైఎస్సార్సీపీ నాయకులకు మద్దతుగా పనిచేస్తున్నారని, టీడీపీ–జనసేన కూటమిలో చిచ్చు పెట్టేందుకు 'కోవర్ట్'గా వ్యవహరిస్తున్నారని టీడీపీ శ్రేణులు సోషల్ మీడియా వేదికగా విమర్శిస్తున్నాయి. ముఖ్యంగా వైఎస్సార్సీపీ నేతలపై విచారణ జరగకుండా అడ్డుకోవడానికి , తన పాత కేడర్‌ను కాపాడుకోవడానికి జనసేన జెండాను వాడుకుంటున్నారనే ఆరోపణలు టీడీపీ వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి. నాయకుల మధ్య సాగుతున్న ఈ పోరు సోషల్ మీడియా వార్‌గా మారి, ఇప్పుడు నేరుగా వీధుల్లోకి వచ్చే వాతావరణం కనిపించడం వల్ల టీడీపీ, జనసేన దిగువ స్థాయి కేడర్ తీవ్ర గందరగోళానికి గురవుతోంది. ఎన్నికల్లో కలసి పనిచేసిన రెండు పార్టీల శ్రేణులు ఇప్పుడు పరస్పరం పోలీసు స్టేషన్ల ముందు ధర్నాలు చేయడం, ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం వల్ల ఉమ్మడి క్యాడర్ స్ఫూర్తి దెబ్బతింటోంది.ఒంగోలులో సాగుతున్న ఈ అంతర్గత పోరు కూటమి ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగిస్తోంది. అధికారంలో ఉన్న కూటమి నేతలే ఒకరిపై ఒకరు ఇసుక, మద్యం అవినీతి ఆరోపణలు చేసుకోవడం ప్రతిపక్ష వైఎస్సార్సీపీకి అతిపెద్ద రాజకీయ ఆయుధంగా మారింది. ఈ సెగ కేవలం ఒంగోలుకే పరిమితం కాకుండా ప్రకాశం జిల్లాలోని ఇతర నియోజకవర్గాలకు పాకితే, కూటమిలోని టీడీపీ–జనసేన శ్రేణుల మధ్య సఖ్యత దెబ్బతినే ప్రమాదం ఉంది.పరిస్థితి చెయ్యి దాటుతుండటంతో టీడీపీ, జనసేన అధిష్టానాలు త్వరితగతిన స్పందించాయి. ఇరు పార్టీల సీనియర్ నేతలు కలసి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, ఇద్దరు నేతలకు హెచ్చరికలు జారీ చేశారు. బహిరంగ విమర్శలు ఆపి, ఏవైనా సమస్యలు ఉంటే సమన్వయ కమిటీ దృష్టికి తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. బాలినేని శ్రీనివాసరెడ్డి – దామచర్ల జనార్ధన్ ల మధ్య పోరు కేవలం ఒక స్థానిక నియోజకవర్గ సమస్య కాదు. స్థానికంగా బలంగా ఉన్న పాత ప్రత్యర్థులు కూటమి గొడుగు కిందకి వచ్చినప్పుడు తలెత్తే సవాళ్లకు ఇది అద్దం పడుతోంది. అధిష్టానాలు వెంటనే కఠిన చర్యలు తీసుకోకపోతే, ఈ వ్యక్తిగత ఆధిపత్య పోరు కూటమి ఓటు బ్యాంకును దెబ్బతీసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

మరో వైపు సమన్వయ కమిటీ నాయకులు ఒంగోలు పరిణామాలకు సంబంధించిన వివరాలను సంబంధిత నేతల నుంచి నేరుగా తెలుసుకునేందుకు జూమ్ ద్వారా మాట్లాడారు. ఇరువర్గాల అభిప్రాయాలను విన్న అనంతరం సమస్యలు ఏమైనా ఉంటే పార్టీ వ్యవస్థలోనే పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రభుత్వానికి లేదా కూటమికి ఇబ్బంది కలిగించేలా బహిరంగ వ్యాఖ్యలు చేయడం వల్ల రాజకీయంగా ప్రత్యర్థులకు అవకాశం కల్పించినట్లవుతుందని హెచ్చరించారు.నేతలు తమ సమస్యలను పార్టీ అధిష్టానాలు, సమన్వయ కమిటీల దృష్టికి తీసుకురావచ్చని స్పష్టం చేశారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం పాలనలో ముందుకు సాగుతున్న సమయంలో చిన్నపాటి విభేదాలు పెద్ద రాజకీయ అంశాలుగా మారకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి నాయకుడిపైనా ఉందని పేర్కొన్నారు. కూటమి బలంగా ఉంటేనే ప్రభుత్వానికి రాజకీయ స్థిరత్వం కొనసాగుతుందని, అందువల్ల వ్యక్తిగత విభేదాల కంటే సమిష్టి ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.ఒంగోలు వివాదంపై తాజా చర్యలతో ఇకపై కూటమి భాగస్వామ్య పార్టీల నేతల మధ్య సమన్వయానికి మరింత ప్రాధాన్యం దక్కే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా బహిరంగ విమర్శలకు దూరంగా ఉండి, సమస్యలను అంతర్గత చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్న సందేశాన్ని నాయకత్వం స్పష్టంగా ఇచ్చినట్లయింది.

